# ది క్రైమ్ న్యూస్

Crime News

తెలుగు దినపత్రిక

సోమవారం, జూన్ 22, 2026 | సంపుటి - 20 | సంచిక 269 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


### రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు

## భారీ వర్షాలు..

### ఎల్లో అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ



రాష్ట్రంలోని రేపటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. గంటకు 40-50 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని అంచనా వేసింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఇవాళ రాష్ట్రంలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ 2లో



### మా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు

## మీకు లేదు..

### పాకిస్థాన్ అధ్యక్షుడికి భారత్ స్ట్రాంగ్ వార్నింగ్

న్యూఢిల్లీ : భారత దేశంలోని ముస్లిం ప్రార్థనా స్థలాలకు ముప్పు పొంచి ఉందంటూ పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ చేసిన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు జర్దారీకి లేదని స్పష్టం చేసింది. ఆయన వ్యాఖ్యలు అసంబద్ధమైనవని, అనవసంమైనవని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ కొట్టిపారేశారు. వారణాసిలోని కాశీ రైల్వే స్టేషన్ సమీపంలోగల గంజ్ షహీదా మసీదుకు భారత రైల్వే శాఖ జారీచేసిన నోటీసులను ఉద్దేశించి జర్దారీ ఈ వ్యాఖ్యలు చేశారు. దీనిపై గురువారం రణధీర్ జైస్వాల్ స్పందిస్తూ.. పాక్ అధ్యక్షుడి ప్రకటనను భారత్ నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తోందని 2లో

### జయశంకర్ ఆశయ సాధనే

# బీఆర్ఎస్ లక్ష్యం

### జయశంకర్ నాకు సైద్ధాంతిక మార్గదర్శిగా నిలిచారు..

### జయశంకర్ స్ఫూర్తితో ముందుకు సాగాలి : కేసీఆర్



హైదరాబాద్ : ఈరోజు ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు (ఖజ=) ఘన నివాళి అర్పించారు. తెలంగాణ సిద్ధాంతకర్త, రాష్ట్ర ఏర్పాటు కోసం తన జీవితాన్ని ధారపోశారని, ఈ సందర్భంగా ఆ మహనీయుడిని స్మరించుకుందామని పేర్కొన్నారు. ఈ మేరకు కేసీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు. బాల్యం నుంచే తెలంగాణ అస్తిత్వం కోసం, సామాజిక రాజకీయ చైతన్యంతో ఆలోచన చేస్తూ, అందుకు తగ్గ భావజాల వ్యాప్తిని కొనసాగించిన నిస్వార్థ మేధావి, తెలంగాణ స్వాప్నికుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. రాష్ట్ర సాధన కోసం మలిదశ ఉద్యమాన్ని తాను ముందుకు తీసుకుపోయే క్రమంలో తన ఆలోచనలకు జయశంకర్ దిక్సూచిగా నిలిచారని తెలిపారు. రాష్ట్ర సాధన పోరాటంలో జయశంకర్ తనకు సైద్ధాంతిక మార్గదర్శిగా నిలిచారని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, రాజ్యాంగ బద్ధంగా, పార్లమెంటరీ ప్రజాస్వామ్య పంథా ద్వారా మాత్రమే సాధ్యమనే విశ్వాసంతో నిర్దిష్ట పరిస్థితులకు అనుసరించి తరువాయి 2లో



### ఆరోగ్యానికి యోగానే

## ఉత్తమ మార్గం

### యోగా దినోత్సవంలో బండి సంజయ్

కరీంనగర్ : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈరోజు ఆదివారం కరీంనగర్‌లో యోగా దినోత్సవంలో బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. యోగా కేవలం ఒక వ్యాయామం మాత్రమే కాదని.. శరీరం, ఆత్మని ఏకం చేసేదే యోగా అని తెలిపారు. ప్రపంచమంతా భారతదేశాన్ని యోగా భూమిగా గుర్తించిందని బండి సంజయ్ పేర్కొన్నారు. ప్రపంచమంతా ఆందోళన, ఒత్తిడితో అతలాకుతలం అవుతోందని తెలిపారు. వైద్యులు కూడా యోగా చేయాలని సూచిస్తున్నారని చెప్పుకొచ్చారు. 177 దేశాలు యోగా అవసరాన్ని గుర్తించాయని వివరించారు. ప్రతిరోజు అరగంటపాటు యోగా చేయాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు.

### యోగా జీవితంలో

## భాగస్వామ్యం కావాలి..

సిద్దిపేట, జూన్ 21: మన జీవితంలో యోగా ఒక భాగస్వామ్యం కావాలని ప్రజలకు మెదక్ లోక్‌సభ సభ్యుడు, ఎంపీ ఎం.రఘునందన్ రావు పిలుపునిచ్చారు. ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని క్రికెట్ స్టేడియంలో జ్యోతి ప్రజ్వలనం చేసి యోగాను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ హైమావతితోపాటు పట్టణ ప్రజలు, వాకర్స్ పాల్గొన్నారు. తరువాయి 2లో



### సంబంధం లేని కేసుతో బిజెపి

## నా నామినేషన్ తిరస్కరించింది

### ఎన్నికల అధికారులతో బిజెపి కుమ్మక్కు : మీనాక్షి నటరాజన్



హైదరాబాద్ : బిజెపి తన సీట్ చోరీకి పాల్పడిందని మీనాక్షి నటరాజన్ తెలిపారు. మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని అన్నారు. గాంధీ భవన్ లో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ కాంప్రమైజ్ అయిందని, ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ కు అవకాశం లేదని బిజెపికి అర్థమైందని, అందుకే ఎన్నికల అధికారులతో కుమ్మక్కు అయ్యారని విమర్శించారు. కనీసం వివరణ ఇచ్చే సమయం కూడా ఇవ్వలేదని, జార్ఖండ్ లో ప్రముఖ పారిశ్రామికవేత్త పరిమళ్ నత్వానికి ఇచ్చిన అవకాశం తనకెందుకు ఇవ్వలేదు? అని మీనాక్షి నటరాజన్ ప్రశ్నించారు. సంబంధం లేని కేసుతో తన నామినేషన్ తిరస్కరించారని, లీగల్ నోటీస్ క్రిమినల్ కేసు ఎలా అవుతుంది? అని నిలదీశారు. ఏదైనా ఫిర్యాదులు వస్తే తన వివరణ తీసుకోవాలని, పరిమళ్ నత్వానీకి ఒక రూల్.. తనకు ఒక రూలా? అని ప్రశ్నించారు. సిల్లీ రీజన్ చూపి తనకు రాజ్యసభ ఎంపి రాకుండా చేశారని మండిపడ్డారు. తెలంగాణలోని రాజ్యసభ సీటు తాను తీసుకోలేనని, తన కోసం మరొకరితో రాజీనామా చేయించి ఆ సీటు తాను తీసుకోలేనని అన్నారు. మధ్యప్రదేశ్ కు చెందిన వ్యక్తిని కాబట్టే అక్కడి నుంచే సీటు కోరుకుంటానని పేర్కొన్నారు. తరువాయి 2లో



### రాష్ట్రంలో మాఫియా

## రాజ్యం నడుస్తోంది

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

హైదరాబాద్: కాంగ్రెస్ ఖేల్ ఖతం.. దుకాణం బంద్ అని రాజేంద్రనగర్ లో మళ్లీ గులాబీజెండా ఎగరడం ఖాయమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. రాజేందర్ నగర్ లో గులాబీశ్రేణులంతా ఫుల్ జోష్ లో ఉన్నారని అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా కెటిఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మాజీ సిఎం కెసిఆర్ మళ్లీ రావాలని జనమంతా కోరుకుంటున్నారని కాంగ్రెస్ పోవాలి..కెసిఆర్ రావాలని ప్రజలంతా నినదిస్తున్నారని తెలియజేశారు. 420 హామీలు, 6 గ్యారెంటీలతో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని, సిఎంగా రేవంత్ అట్టర్ ఫ్లాప్ అయ్యాడని విమర్శించారు. రాష్ట్రంలో మాఫియా రాజ్యం నడుస్తోందని, ల్యాండ్, శ్యాండ్ మాఫియా, మైనింగ్ విజృంభిస్తోందని, దండుపాళ్యం బ్యాచ్ ముఠా నాయకుడిలా రేవంత్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తరువాయి 2లో

### రొయ్యల పరిశ్రమలో

## గ్యాస్ లీక్..

### ఏడుగురు మహిళలు మృతి




చెన్నై: తమిళనాడు తిరువళ్లూరులో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఓ ప్రైవేటు రొయ్యల ప్రాసెసింగ్ ప్లాంట్‌లో అమ్మోనియా గ్యాస్ లీకై ఏడుగురు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. మరో 60 మందికి పైగా కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధితులను స్థానిక ఆసుపత్రుల్లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. అయితే, వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనా ప్రాంతంలో పర్యటించిన స్థానిక కలెక్టర్ బాధిత కార్మికులను పరామర్శించారు. ఈ ప్రమాదంపై పూర్తిస్థాయి దర్యాప్తునకు ఆదేశించారు. 2లో

### ఆరోగ్య తెలంగాణకు

# యోగానే మార్గం

### యోగా దినోత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్



సిద్దిపేట : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద యోగా దినోత్సవంలో పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. మంత్రి పొన్నం, స్థానిక యువకులు, ఔత్సాహితులతో కలిసి యోగాసనాలు చేసి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం తరుపున 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. యోగా అనేది సంప్రదాయంగా ప్రాచీన భారత వ్యవస్థలో, మన జీవన ప్రక్రియలో ఒక అంతర్భాగమని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ప్రజలందరికీ యోగాపై ప్రేరణ కలిగే విధంగా హుస్నాబాద్‌లో 12 సూర్య నమస్కారాలతో విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. అందరు కూడా జీవితంలో తప్పనిసరిగా యోగాను ఓ భాగంగా చేసుకొని ఆరోగ్య హుస్నాబాద్, ఆరోగ్య తెలంగాణ, ఆరోగ్య భారత్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. 2లో

# రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు..

నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహూబాబాబాద్, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. రేపు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఎల్లుండి మంగళవారం నాడు ఆదిలాలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే అన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. బుధవారం నాడు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. అలాగే అన్ని జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

# రాష్ట్రంలో మాఫియా రాజ్యం నడుస్తోంది

రేవంత్ పాలనలో నిజాయితీగా పనిచేసే అధికారులకు స్థానం లేదని, 420 పాలనలో ఇవాళ తెలంగాణ నలిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో పారిశ్రామికవేత్తలను బెదిరించే రోజులు వచ్చేశాయని, రేవంత్ పాలనలో హైడ్రా పేరుతో అంతా విధ్వంసకాండ జరుగుతోందని ధ్వజమెత్తారు. హైడ్రా భూతం పేరిట నిరుపేదల ఇళ్లను రేవంత్ సర్కారు కూలగొడుతుందని, ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పక్కన బెట్టేసిందని కెటిఆర్ ఎద్దేవా చేశారు.

## తెలంగాణ మట్టి గడ్డను తీర్చిదిద్దిన ముద్దుబిడ్డ జయశంకర్: హరీశ్ రావు

హైదరాబాద్, జూన్ 21: తెలంగాణ సిద్ధాంత కర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జన్మదినం నేడు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి. హరీశ్ రావు తన ఎక్స్ ఖాతా వేదికగా ఆదివారం స్పందించారు. ' తెలంగాణ మట్టి గడ్డను తీర్చిదిద్దిన ముద్దుబిడ్డ. తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక పునాదులు వేసిన మహోన్నత దార్శనికుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ గారు. చివరి శ్వాస వరకు తెలంగాణ రాష్ట్ర సాధనకే అంకితమైన ఆయన జీవితం, పోరాటం, త్యాగం తరతరాలకు స్ఫూర్తి. వారి ఆశయాలకు అనుగుణంగా, ఎంతటి త్యాగాలకైనా సిద్ధపడి తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు కంకణ బద్ధులమై ఉంటామని పునరుద్ఘాటిస్తూ.. ఆచార్య జయశంకర్ గారి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు' అని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు.

## ఆరోగ్య తెలంగాణకు యోగానే మార్గం

యోగా చేయడానికి వయసుతో ఎలాంటి సంబంధం లేదని, ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితంలో భాగంగా చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## మైనంపల్లి హన్మంతరావు ఒకే రోజు 3 పార్టీలు మారాడు : మన్నె క్రిశాంక్



హైదరాబాద్ నిండా కుక్కలు ఎలా ఉన్నాయో కాంగ్రెస్ పార్టీలో కూడా కొందరు పిచ్చి కుక్కల లాగా చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్ ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతరావుకు స్ట్రాంగ్ కౌంటర్ ఇస్తూ ఎవడు రౌడీయిజం చేసినా కూడా కార్యకర్తలు భయపడవద్దని సూచించారు. మైనంపల్లి హన్మంతరావు పరిస్థితి ధోబీకా కుత్తా నా ఘర్ కా నా ఘాట్ కా అన్నట్లు తయారైందన్నారు. మైనంపల్లికి మానసిక చికిత్స అవసరం ఉంది. ఆయన కొడుకు వల్ల ఆయనకి పని లేకపోవడం వల్ల ఏది పడితే అది మాట్లాడుతున్నాడు. టీడీపీలో ఉన్నప్పుడు మైనంపల్లిని నగర బహిష్కరణ చేశారు. మైనంపల్లి 8 ఏప్రిల్ 2014లో ఒకే రోజు మూడు పార్టీలు మారాడు.. పొద్దున టీడీపీ, మధ్యాహ్నం కాంగ్రెస్, సాయంత్రం బీఆర్ఎస్ అని మన్నె క్రిశాంక్ అన్నారు. ఎవరూ టికెట్ ఇవ్వకపోయే సరికి సాయంత్రానికి కేటీఆర్ కాళ్లకాడికి వచ్చాడన్నారు. మైనంపల్లి నువ్వు ఒక్కడివే రా చూసుకుందామని సవాల్ విసిరిన మన్నె క్రిశాంక్.. నువ్వు నిజంగానే హీరో అయితే, దమ్ము, ధైర్యం ఉంటే నువ్వు ఒక్కడివే రా.. లేదు చాతకాదు అంటే నీ కొడుకుని కూడా తెచ్చుకో అన్నారు. కేటీఆర్‌ను ఎట్లా టార్గెట్ చేద్దామా..? అని.. కేటీఆర్ ఒక వక్తగా ప్రపంచ స్థాయిలో ఎక్కడైనా మాట్లాడగలుగుతారు. అడ్మినిస్ట్రేషన్‌లో సక్సెస్ అయిండు. ఎన్నికలు గెలిపించగలిగారు. 2015లో జీహెచ్ఎంసీ ఎన్నికలు అయినప్పుడు బ్రహ్మాండంగా క్లీన్ స్వీప్ చేసి మేయర్ అయిండు. 2020లో మళ్లీ జీహెచ్ఎంసీ ఎన్నికలైనప్పుడు మళ్లీ బీఆర్ఎస్ నుంచే మేయర్ అయ్యేటట్టు చేశారు కేటీఆర్ . మూడోసారి హ్యాట్రిక్ చేస్తారు కాబట్టే కేటీఆర్‌ను ఎట్లా డైవర్ట్ చేద్దామా.. టార్గెట్ చేద్దామా..? వ్యక్తిత్వ హననం ఎట్లా చేద్దామా అని కేవలం కాంగ్రెస్ చేస్తున్న పని అదే. మీకు కేటీఆర్ అవసరం లేదు. కేటీఆర్ వారి కార్యక్రమాలు చేసుకుంటరు.. మీకు మేం చాలన్నారు. మైనంపల్లి హన్మంతరావు సింగిల్‌గా వస్తే సింగిల్‌గా వస్తం. గుంపుగా వస్తే మొత్తం బీఆర్ఎస్ అంతా కూడా గుంపుగా వస్తామని మన్నె క్రిశాంక్ హెచ్చరించారు.

# జయశంకర్ ఆశయ సాధనే బీఆర్ఎస్ లక్ష్యం

సాగిన తన కార్యాచరణకు ఆయన భేషరతుగా మద్దతునిచ్చారని చెప్పుకొచ్చారు. జయశంకర్ స్ఫూర్తి, ఎంతో ఉన్నతమైనదని.. క్రియాశీలమైనదని తెలిపారు. నాటి పదేళ్ల బీఆర్ఎస్ పాలన, సబ్బండ కులాల సంక్షేమం అభివృద్ధి కోసం కృషిచేసి, వారి జీవితాల్లో వెలుగులు నింపామని వెల్లడించారు. జయశంకర్ ఆకాంక్షలకు, ఆశయాలకు అనుగుణంగా తన పాలన కొనసాగిందని అన్నారు. తెలంగాణకు స్వీయ రాజకీయ అస్తిత్వమే శ్రీరామరక్ష అని పదేపదే జయశంకర్ నినదించించారని చెప్పుకొచ్చారు. జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా, ఎంతటి త్యాగాలకైనా ఓర్చి తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు బీఆర్ఎస్ కంకణబద్ధమై ఉందని కేసీఆర్ పునరుద్ఘాటించారు. గడచిన రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో, ఆయన ఆశయాలు గాడి తప్పుతున్నాయని, ప్రమాదంలో పడిన తెలంగాణ అస్తిత్వాన్ని నిలబెట్టుకునేందుకు జయశంకర్ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డ ఉద్యమ స్ఫూర్తిని పుణికి పుచ్చుకొని, అస్తిత్వ పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన తరుణం ఆసన్నమైందని స్పష్టం చేశారు. తెలంగాణ గరిమను, సామాజిక రాజకీయ అస్తిత్వాన్ని నిరంతరం కాపాడుకోవడమే, ప్రొఫెసర్ జయశంకర్‌కి మనం ఇచ్చే ఘన నివాళి అని కేసీఆర్ పునరుద్ఘాటించారు.

## యోగా జీవితంలో భాగస్వామ్యం కావాలి..

ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ.. ప్రజలందరికీ 12వ అంతర్జాతీయ యోగా శుభాకాంక్షలు తెలిపారు.పని ఒత్తిడి ఎంత ఉన్నా ప్రతిరోజు యోగా చేయాలని ప్రజలకు స్పష్టం చేశారు. 75 సంవత్సరాల్లో కూడా ప్రధాని నరేంద్ర మోదీ ఇంత ఆరోగ్యంగా ఉన్నారంటూ అందుకు యోగానే కారణమని ఆయన వివరించారు. భారతదేశంలో అతి ప్రాచీనమైన విద్య యోగా అని సిద్ధిపేట జిల్లా కలెక్టర్ హైమావతి తెలిపారు. స్వచ్ఛమైన ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరి యోగా చేయాలని సూచించారు. ప్రజల జీవన విధానం మారిందని.. అందుకే ప్రతి ఒక్కరు యోగా చేయాలని ప్రజలకు కలెక్టర్ హైమావతి స్పష్టం చేశారు.

## రూ.95 లక్షల ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసం కేసు ఛేదన..

## ఏడుగురు అరెస్ట్



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రూ.95 లక్షల ఆన్‌లైన్ ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ మోసం కేసును ఛేదించి, ఈ కేసులో ప్రమేయం ఉన్న ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశారు. క్రైమ్ నెంబర్ 1053/2026 కింద నమోదు చేసిన ఈ కేసులో మోసపూరిత సొమ్ము తరలింపుకు ఉపయోగించిన మ్యూల్ బ్యాంక్ ఖాతాలను గుర్తించి, భారీ మొత్తంలో నగదు, డిజిటల్ ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం బాధితుడు శ్రీకాంత్ రెడ్డి అలియాస్ సురేష్ రెడ్డిని "ఎలెరా క్యాపిటల్ డెస్క్" పేరుతో నడిపిస్తున్న నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్, పెట్టుబడి వేదికలో పెట్టుబడులు పెట్టేలా నిందితులు ప్రలోభపెట్టారు. వాట్సాప్ గ్రూపులు, ఇతర ఆన్‌లైన్ మాధ్యమాల ద్వారా అధిక లాభాలు వస్తాయని నమ్మించి తొలుత రూ.46 లక్షలు పెట్టుబడి పెట్టించారు. అనంతరం ట్రేడింగ్ ఖాతాలో రూ.2,04,54,000 లాభం వచ్చినట్లు నకిలీగా చూపించారు. ఆ మొత్తాన్ని ఉపసంహరించుకునేందుకు ప్రయత్నించగా ట్యాక్స్, సెక్యూరిటీ డిపాజిట్, ప్రాసెసింగ్ ఫీజు, ఇతర చార్జీల పేరుతో మరో రూ.49 లక్షలు వసూలు చేశారు. ఈ విధంగా మొత్తం రూ.95 లక్షలు కాజేశారు. డబ్బు తిరిగి రాకపోవడంతో తాను మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, బ్యాంకింగ్ లావాదేవీలు, మనీ ట్రైల్‌ను విశ్లేషించి మోసపూరిత సొమ్ము 45 లేయర్ బ్యాంక్ ఖాతాల ద్వారా తరలించినట్లు గుర్తించారు. ప్రత్యేక బృందాలు విశాఖపట్నం గాజువాక ప్రాంతంలో ఆపరేషన్ నిర్వహించి ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నాయి. అరెస్టైన వారిలో రపర్తి గౌతమ్, సేనాపతి పెంటయ్య, బొడాల సాయి కుమార్, మురపాకల కుమార్, విజ్జపు సత్యనారాయణ, మంత్రి సాయి కుమార్, ఊట నారాయణ ఉన్నారు. వీరిలో కొందరు అకౌంట్ సప్లయర్లు, కొందరు నగదు సేకరణ, రవాణా, పంపిణీలో కీలకంగా వ్యవహరించగా, మరికొందరు మ్యూల్ ఖాతాలను సమకూర్చి మనీలాండరింగ్‌కు సహకరించినట్లు దర్యాప్తులో తేలింది. దర్యాప్తులో భాగంగా పోలీసులు రూ.26,57,500 నగదు స్వాధీనం చేసుకోగా, రూ.12 లక్షల విలువైన బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేశారు. అదనంగా కోర్టు ద్వారా రూ.9 లక్షల రీఫండ్ ఆర్డర్లు పొందారు. నేరానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్లు, ఇతర డిజిటల్ ఆధారాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు ఛేదనలో ఇన్‌స్పెక్టర్ మధు, ఎస్ఐ శ్రీనివాస్, వారి బృందం కీలకంగా వ్యవహరించారని, ఏసీపీ రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో దర్యాప్తు విజయవంతంగా పూర్తైందని డీసీపీ సైబర్ క్రైమ్ టి. సాయి మనోహర్ తెలిపారు. కేసు ఛేదనలో విశేష కృషి చేసిన అధికారులను ఆయన అభినందించారు. సైబర్ క్రైమ్ పోలీసులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా వచ్చే పెట్టుబడి సూచనలను నమ్మరాదని, తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని చెప్పే ట్రేడింగ్ వేదికల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారతీయ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు అనుమతి పొందిన సంస్థల ద్వారానే పెట్టుబడులు పెట్టాలని, డబ్బు ఉపసంహరణ కోసం అదనపు ట్యాక్సులు లేదా చార్జీలు చెల్లించాలని కోరితే వెంటనే అనుమానించాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని, లేదా సైబర్ నేరాల ఫిర్యాదు వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని కోరారు.

## యూజీడీ పైప్‌లైన్ మరమ్మత్తు పనులను పరిశీలించిన ఆరెకపూడి గాంధీ



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని మసీదు బండ ప్రధాన రహదారిపై 450 ఎంఎం వ్యాసం గల ఆర్‌సీసీ యూజీడీ పైప్‌లైన్ దెబ్బతినడంతో చేపడుతున్న మరమ్మత్తు, పునరుద్ధరణ పనులను పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా యాదవ సహకార సంస్థ చైర్మన్ రఘునాథ్ యాదవ్, తాజా మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, జలమండలి అధికారులు, సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ యూజీడీ పైప్‌లైన్ పగిలిపోవడం వల్ల సమస్య తలెత్తిందని, మరమ్మత్తు పనుల్లో వేగం పెంచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీ పడొద్దని సూచించారు. అలాగే ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, ప్రజలకు అసౌకర్యం లేకుండా పనులు చేపట్టాలని, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా మాధవ హిల్స్, శిల్ప వ్యాలీ కాలనీలలో యూజీడీ వ్యవస్థ పనితీరు, నిర్వహణ, అభివృద్ధి అవసరాలపై అధికారులతో చర్చించారు. శేరిలింగంపల్లి పరిధిలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఆరెకపూడి గాంధీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్లు సందీప్, లోకేష్, సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం డీఈ ఆనంద్, ఏఈ భాస్కర్‌తో పాటు సీనియర్ నాయకులు మారబోయిన రాజు యాదవ్, జనార్దన్ రెడ్డి, మల్లేష్ యాదవ్, కోడిచెర్ల రాములు, మల్లేష్, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మోనాలిసా దంపతులకు రక్షణ

తిరువనంతపురం : 'కుంభమేళా గర్ల్' మోనాలిసాకు భద్రత కల్పించటంపై కేరళ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. మోనాలిసా, ఆమె భర్త మొహమ్మద్ ఫర్మాన్‌కు భద్రత కల్పించాలంటూ పోలీసులను ఆదేశించింది. ఆ వివరాల్లోకి వెళితే.. మోనాలిసా, మొహమ్మద్ ఫర్మాన్‌కు ఆన్‌లైన్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారి.. మార్చి 11వ తేదీన తిరువనంతపురంలోని అరుమనూర్ ఆలయంలో హిందూ సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకున్నారు. పెళ్లి తర్వాత మోనాలిసా వయసుపై తీవ్ర స్థాయిలో విమర్శలు మొదలయ్యాయి. ఫర్మాన్ తన కూతురిని కిడ్నాప్ చేసి పెళ్లి చేసుకున్నాడని మోనాలిసా తండ్రి మధ్యప్రదేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో 'నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్'కు ఫిర్యాదు కూడా వెళ్లింది. 'నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్' మోనాలిసా వయసుపై దర్యాప్తు చేయగా.. ఆమె మైనర్ అని తేలింది. నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ దర్యాప్తులో బయటపడ్డ విషయాల మేరకు పోలీసులు పలు సెక్షన్ల కింద మోనాలిసా భర్తపై కేసులు నమోదు చేశారు. మధ్యప్రదేశ్ పోలీసులు ఫర్మాన్‌ను అరెస్ట్ చేయడానికి ప్రయత్నించగా.. అతడు కేరళ హైకోర్టును ఆశ్రయించాడు. కేరళ హైకోర్టు ఫర్మాన్ ఖాన్‌ను అరెస్ట్ చేయకుండా స్టే విధించింది. ప్రస్తుతం భార్యాభర్తలు ఇద్దరూ కేరళలోనే ఉంటున్నారు.

## మా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు మీకు లేదు..

భారత అంతర్గత విషయాలపై మాట్లాడే అర్హత ఆయనకు ఏమాత్రం లేదని తేల్చిచెప్పారు. పాకిస్థాన్‌లో మైనారిటీల హక్కుల ఉల్లంఘన, అక్కడి మానవ హక్కుల దయనీయ స్థితిపై అంతర్జాతీయంగా వస్తున్న విమర్శలను జైస్వాల్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇతరులకు హితవు పలికే ముందు పాక్ తన దేశంలోని పరిస్థితులను చక్కదిద్దుకోవాలని సూచించారు. ద్వేషం, మతతత్వాన్ని ప్రోత్సహించడమే పాకిస్థాన్ జాతీయ విధానంగా కనిపిస్తోందని ఆయన విమర్శించారు. భారత్ తన అంతర్గత విధానాలకు సంబంధించిన అంశాల్లో, ముఖ్యంగా జమ్మూకశ్మీర్ వంటి విషయాల్లో విదేశాల జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని చాలాకాలంగా హెచ్చరిస్తోంది.

## సంబంధం లేని కేసుతో బిజెపి నా నామినేషన్ తిరస్కరించింది

అభిషేక్ సింఘ్వీ లాంటి వారికి వేరే రాష్ట్రాల సీట్లు ఇవ్వాలని సూచించారు. తనలాంటి వాళ్లకు తెలంగాణ నుంచి రాజ్యసభ స్థానాన్ని ఇచ్చేందుకు ఒప్పుకోనని, తన కేసుల అంశాన్ని కాంగ్రెస్ నేతలు ఇచ్చారనేది పచ్చి అబద్ధం అని తెలియజేశారు. బిజెపి కావాలనే అబద్ధాలను సృష్టించిందని, తాను బాధితుల పక్షం..శ్రీలతకు కూడా తాను అండగా ఉన్నానని అన్నారు. శ్రీలతకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయని, శ్రీలతపై అనేక ఆరోపణలు ఉన్నప్పటికీ మహిళగా ఆమె వాదన విన్నామని చెప్పారు. కేసు ఉన్నంత మాత్రానా నామినేషన్ తిరస్కరణ కాలేదని, బిజెపి, ఇసి పూర్తిగా లాలూచీ పడి తన నామినేషన్ తిరస్కరించారని ధ్వజమెత్తారు. కేవలం ఒక్క సీటుకు సంబంధించిన విషయం కాదని, తన నామినేషన్ విషయంలో బిజెపి చేస్తున్న ఆరోపణలు అబద్ధం అని అన్నారు. నామినేషన్ తిరస్కరణకు గురైనందుకు బాధ లేదని, బిజెపి నేతలను నామినేషన్ రూంలోనికి ఎందుకు అనుమతించారని మీనాక్షి నటరాజన్ ప్రశ్నించారు.

# రొయ్యల పరిశ్రమలో గ్యాస్ లీక్..

ఈ ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని సంబంధిత మంత్రులను ఆదేశించారు. ఈ ఘటనలో ఫ్యాక్టరీ యజమానితో పాటు మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

## భారత ఇంధన భద్రతకు భారీ ఊరట.. హర్మూజ్ దాటిన మూడు భారత నౌకలు

హొత్తుఖ్ శీట ఎశీతీఎబఓ : భారత సముద్ర వాణిజ్యానికి, ఇంధన భద్రతకు పెద్ద ఊరట లభించింది. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి (హొత్తుఖ్ శీట ఎశీతీఎబఓ) ని మూడు భారత జెండా కలిగిన భారీ క్రూడ్ ఆయిల్ (జతీబఎవ ాఱశ్రీ) ట్యాంకర్లు విజయవంతంగా దాటాయి. 8.6 లక్షల మెట్రిక్ టన్నుల ముడిచమురుతో ఈ నౌకలు ప్రస్తుతం భారత ఓడరేవుల వైపు ప్రయాణిస్తున్నాయి. పశ్చిమాసియా (ఔవర్‌ాంఱ్ఞు) లో నెలకొన్న రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా కొన్నాళ్లుగా నిలిచిపోయిన ఈ జలమార్గంలో రవాణా తిరిగి ప్రారంభం కావడం భారత్‌కు శుభపరిణామం. ఈ విషయాన్ని కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ 'ఎక్స్' ద్వారా ప్రకటించారు. 'దేశ్ వైభవ్', 'దేశ్ విభోర్', 'సన్మార్ హెరాల్డ్' అనే మూడు నౌకలు 94 మంది భారత సిబ్బందితో హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటినట్లు ఆయన తెలిపారు. 'ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయాత్మక నాయకత్వంలో భారత ప్రభుత్వం దేశ సముద్ర ప్రయోజనాల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. మన నావికుల భద్రత, దేశ ఇంధన సరఫరా మార్గాల పరిరక్షణ కోసం మా మంత్రిత్వ శాఖ అన్ని సంబంధిత ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తోంది' అని సోనోవాల్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం.. ఈ మూడు నౌకలు జూన్ 24 నుంచి జూలై 1 మధ్య భారత తీరానికి చేరుకోనున్నాయి. 'దేశ్ వైభవ్' జూన్ 24న గుజరాత్‌లోని వాడినార్ పోర్టుకు, 'దేశ్ విభోర్' అదే రోజున సిక్కా పోర్టుకు చేరుకునే అవకాశం ఉంది. ఇక జూన్ 20న హర్మూజ్ జలసంధిని దాటిన 'సన్మార్ హెరాల్డ్' నౌక జూలై 1న ఒడిశాలోని పారాదీప్ పోర్టుకు చేరుకోనుంది. ఈ పరిణామం వెనుక అంతర్జాతీయంగా చోటుచేసుకున్న కీలక దౌత్యపరమైన పరిణామాలు ఉన్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించే లక్ష్యంతో అమెరికా, ఇరాన్ మధ్య ఇటీవల ఒక ఒప్పందం కుదిరింది. జూన్ 18న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఒప్పందంపై సంతకం చేశారు. దీని ప్రకారం ఇరాన్ తన వద్ద ఉన్న అత్యధిక శుద్ధి చేసిన యురేనియం నిల్వలను తగ్గించుకోవాలి, ప్రతిగా అమెరికా కొన్ని ఆంక్షలను సడలిస్తుంది. ఈ ఒప్పందం తర్వాత అదే రోజున హార్మూజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలపై ఉన్న ఆంక్షలను అమెరికా ఎత్తివేసింది. దీంతో నెలల తరబడి స్తంభించిన ఈ మార్గంలో చమురు ట్యాంకర్ల సంచారం తిరిగి ప్రారంభమైంది. దేశీయ ఇంధన అవసరాల కోసం అధికంగా ముడి చమురు దిగుమతులపైనే ఆధారపడి ఉన్న భారత్‌కు, సముద్ర మార్గాల్లో రవాణా నిరంతరాయంగా సాగడం అత్యంత ముఖ్యం. ఈ నౌకలు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరడం అనేది ఒకవైపు అంతర్జాతీయ దౌత్య విజయాన్ని, మరోవైపు భారత ప్రభుత్వం తన ఇంధన భద్రతకు, సముద్ర ప్రయోజనాలకు ఇస్తున్న ప్రాధాన్యతను సూచిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. సున్నితమైన అంతర్జాతీయ జలాల్లో ప్రయాణించే నౌకలు, సిబ్బంది భద్రత కోసం వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయం నిరంతరం కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

# మంచిరామి గ్రామంలో భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతలకు జలాభిషేకం



సుల్తానాబాద్, జూన్ 21(ది క్రైమ్ న్యూస్): సుల్తానాబాద్ మండలంలోని మంచిరామి గ్రామంలో గ్రామ దేవతలకు ప్రత్యేక జలాభిషేక మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఉప్పు లక్ష్మి, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఉప్పు తిరుపతి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామం సర్వతోముఖాభివృద్ధి చెందాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని దేవతలకు ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో సకాలంలో వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటూ ఈ జలాభిషేకం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పాలకవర్గ ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

# పదో తరగతి విద్యార్థినిలకు వాకర్ టీం చేయూత

**తండ్రి లేని పేద విద్యార్థినిలకు ఫాదర్స్ డే రోజు అండగా నిలిచిన గరిమిళ్ల శ్రీధర్ రెడ్డి**



గోదావరి ఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్) : మానవసేవే మాధవసేవ, ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అని ఆదర్శంగా నిలుస్తున్నారు గోదావరిఖని జవహర్లాల్ నెహ్రూ స్టేడియం వాకర్స్ సభ్యులు. ఆరోగ్యాన్ని కాపాడుకోవటంలోనే కాదు ఆపదలో ఉన్న వారికి అండగా నిలబడతామంటూ వారి యొక్క గొప్ప మనస్తత్వాన్ని సేవా దృక్పథాన్ని చాటుకుంటున్నారు. గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో అమ్మపరివార్ అనాథాశ్రమంలో ఉంటూ స్థానిక అశోక్ నగర్ లోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న బొల్లి అక్షయ, స్వతంత్ర చౌక ప్రాంతానికి చెందిన నేష శ్రీ చక్ర ఈ విద్యా సంవత్సరం 10వ తరగతిలోకి ప్రవేశించడం జరిగింది. ప్రభుత్వం నుండి అందే సాయంతో పాటు వీరు పదో తరగతి పూర్తి చేయడానికి అవసరమయ్యే గైడ్స్ ఎఫ్ఏ బుక్కులు కొనుక్కోవటానికి కూడా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయం తెలుసుకొని వాకర్ టీం సభ్యులు శ్రీధర్ రెడ్డి ముందుకు వచ్చి వారి సొంత ఖర్చులతో ఇద్దరు విద్యార్థినులకు అవసరమయ్యే మెటీరియల్ ని ఆదివారం ఫాదర్స్ డే రోజు వారికి అందజేసి ఒక కుటుంబ సభ్యుడిగా వారిని ఆదుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో చదువు కేవలం కొనుక్కుంటే తప్ప పూర్తిస్థాయిలో అందటం లేదని ఇటువంటి పరిస్థితుల్లో నిరుపేద విద్యార్థులకు తన వంతుగా వారి చదువుకై అవసరమైన పుస్తకాలను అందజేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. అదేవిధంగా వాకర్స్ టీం సభ్యులు మాట్లాడుతూ చదువు అనేది ప్రాథమిక హక్కు అని చదువుకునే క్రమంలో ఎటువంటి ఇబ్బందులతో కూడా మధ్యలో చదువు ఆగిపోకూడదనే ముఖ్య ఉద్దేశంతో చదువుకునే విద్యార్థులు ఎవరైనా ఆర్థిక ఇబ్బందులతో ఉన్న వాకర్ టీం సభ్యులందరూ ఏకమై వారికి అన్ని విధాలుగా ఆదుకునేందుకు ముందుంటామని ఈ సందర్భంగా వారు అన్నారు. కాబట్టి చదువుకు ధనిక పేద అనే తారతమ్యం లేదని విద్యార్థులందరూ కూడా తమ లక్ష్యం కోసం ఏకాగ్రతతో చదువుకుంటూ వారు ఎంచుకున్న ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆ లక్ష్యసాధనలో మా వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి.

మిర్యాలగూడ పట్టణానికి చెందిన పి. బిక్షం (53) రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈ ఘటన మిర్యాలగూడ మండలంలోని కుక్కడం సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బిక్షం అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిసింది. మృతుడు మిర్యాలగూడ నివాసి కాగా, ఆయనకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ప్రమాద వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



# సుల్తానాబాద్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

## భారతీయ సంస్కృతికి దక్కిన ప్రపంచ గౌరవం యోగా: జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్

## పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, వాకర్స్ మరియు విద్యార్థులు





సుల్తానాబాద్, జూన్ 21(ది క్రైమ్ న్యూస్) : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణానికి చెందిన వాకర్స్, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉత్సాహంగా యోగా ఆసనాలు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, స్థానిక కౌన్సిలర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరం యోగా అని కొనియాడారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది జరుపుకోవడం భారతీయ సంస్కృతికి దక్కిన గొప్ప గౌరవమన్నారు. శరీరం, మనస్సు, ఆత్మ మధ్య సమతుల్యతను నెలకొల్పడంలో యోగా ఎంతో ఉపయోగపడుతుందని, అన్ని వయస్సుల వారు యోగాను నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. అనంతరం యోగా శిక్షకులు మురళీధర్, దేవరకొండ ప్రకాష్, కోడెం అజయ్‌లు వివిధ యోగా ఆసనాలను ప్రదర్శించి, వాటి ప్రాముఖ్యతను వివరించారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఒత్తిడి తగ్గి ప్రశాంత జీవనం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ.. విద్యార్థులు యోగాను అలవాటు చేసుకుంటే ఏకాగ్రత పెరిగి విద్యారంగంలో మంచి ఫలితాలు సాధించగలరని తెలిపారు. ఆరోగ్య పరిరక్షణ, ఫిట్‌నెస్‌పై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. అనంతరం ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణ కోసం యోగాను నిత్యం సాధన చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సామూహికంగా యోగా సాధన నిర్వహించి ఆరోగ్య అవగాహన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు కందునూరి సమతా కుమార్, అమిరి శెట్టి శ్రావణి రాకేష్, సిద్ధ తిరుపతి, వేగోళం పద్మ అబ్బయ్యగౌడ్, గాదాసు మంజుల రవీందర్ అలాగే వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు అమిరి శెట్టి రాజలింగం, అధ్యక్షులు చొప్పరి సుమన్, ప్రధాన కార్యదర్శి నిట్టూరి శ్రీనివాస్, కోశాధికారి కామణి శ్రీకాంత్, మాజీ ప్రధాన కార్యదర్శి మంద శ్రీనివాస్ గౌడ్, ముఖ్య సలహాదారులు చిలగాని లక్ష్మణ్, మాదర బోయిన రాజేంద్రప్రసాద్, సాదుల సుగుణాకర్, సహాయ కార్యదర్శి కొలిపాక రవీందర్, జాయింట్ సెక్రెటరీ ఎలిగేటి రమేష్, లీగల్ అడ్వైజర్ కోడెం అజయ్, గుడ్ల వెంకటేష్, ప్రచార కార్యదర్శి సుంక వేణు పాల్గొన్నారు. ాకార్యవర్గ సభ్యులు బూడిద స్వామి, మద్దెల కొమురయ్య, సల్కం శ్రీనివాస్, శ్రీగిరి సుధాకర్, ఉల్లంగుల శ్రీనివాస్, దర్శనల రామచంద్రం, రామకృష్ణ, భైరగోని ప్రభాకర్, వాకర్ సభ్యులు ఎలగందుల మల్లేశం, అడ్వకేట్ ఆవుల శివ, పోడేటి వెంకటేష్, రమణ, కట్ల రాజమౌళి, ఎండి ఖాసిం, బాలసాని శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, బిక్షపతి, కట్ల శ్రీనివాస్, లింగమూర్తి, అమిరి శెట్టి తిరుపతి, గంధం రాజేష్, గడ్డం శ్రీనివాస్, పిడుగు పోచాలు, కలగూర విజయ్ కుమార్, శ్రీశైలం, వెంకటపతి, రాఘవులు, కొమురవెల్లి ప్రభాకర్, ఎల్లయ్య, సతీష్ రావు, అంతటి సంతోష్, సిరిపురం రమేష్, క్రీడా కోచ్ వెంకటేష్, స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలి



రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాప్రతి 15 రోజులకు ఒకసారి యోగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశంగోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్)యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. ఆదివారం రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో పోలీస్ పరేడ్ మైదానంలో ప్రపంచ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో అంబర్ కిషోర్ ఝా పాల్గొని అధికారులు, సిబ్బందితో కలిసి యోగా ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా అందరికీ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థకు చెందిన యోగా శిక్షకుల ఆధ్వర్యంలో ఈ శిక్షణ సాగింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ యోగా ఒకరోజుతో పరిమితం కాకుండా నిత్య జీవితంలో భాగం కావాలని, యోగా దినోత్సవానికే పరిమితం చేయకుండా ప్రతి 15 రోజులకు ఒకసారి శాఖల స్థాయిలో ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి సిబ్బందిలో అవగాహన పెంపొందించాలని అధికారులను ఆదేశించారు. నేటి జీవన విధానంలో మనిషి అనేక ఒత్తిళ్లకు గురవుతున్నాడని, యోగా ద్వారా వాటి నుంచి ఉపశమనం పొందవచ్చని తెలిపారు. యోగా చేయడానికి ప్రత్యేకమైన పరికరాలు గానీ, ఇతరుల సహకారం గానీ అవసరం లేదని, వ్యక్తిగత నిబద్ధత, సంకల్పం ఉంటే సరిపోతుందని అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, మంచి ఆరోగ్యం మనిషికి అత్యంత విలువైన ఆస్తి అని పేర్కొన్నారు. జీవితంలో ఎంతటి ఉన్నత స్థానాలు సాధించినా, ఎంతటి సంపద సంపాదించినా వాటిని ఆనందించడానికి ఆరోగ్యవంతమైన శరీరం అవసరమని తెలిపారు. అందుకే ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగా సాధన చేయడంతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరులను కూడా యోగా చేయడానికి ప్రోత్సహించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది సాధారణంగా శారీరక దృఢత్వానికి అధిక ప్రాధాన్యత ఇస్తారని, కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న యువ పోలీస్ సిబ్బందిని అభినందించారు. యువత తమ శారీరక, మానసిక ఆరోగ్యంపై మరింత శ్రద్ధ చూపాలని, ప్రస్తుతం అందరూ మంచి ఫిట్‌నెస్‌తో ఉన్నారని, భవిష్యత్తులో కూడా అదే స్థాయిని కొనసాగించాలని సూచించారు. యోగాతో ప్రశాంతమైన మనస్సు, ఆరోగ్యవంతమైన శరీరం లభిస్తాయని, మానసిక ప్రశాంతతకు, శారీరక దృఢత్వానికి యోగా ఉత్తమ సాధనమని పేర్కొన్నారు. నిత్య యోగా సాధన ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ కె శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అఫ్జలోద్దీన్, రామగుండం సీఐ కృష్ణకుమార్, ఆర్ ఐలు దామోదర్, మల్లేశం, శేఖర్, రమేష్, ఎస్ ఐలు, ఆర్ ఎస్ ఐలు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ యోగా శిక్షకురాలు రాధిక తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు.




మిర్యాలగూడ, జూన్ 21: తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి మేధోబలాన్ని అందించిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రీ తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నల్లమోతు సిద్ధార్థ, తెలంగాణ ఉద్యమ నాయకులు అన్నభీమోజు నాగార్జునాచారి పాల్గొని జయశంకర్ సార్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన విశిష్ట సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందించి ప్రత్యేక రాష్ట్ర సాధనకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడు జయశంకర్ సార్ అని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ తెలంగాణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎండి ఇలియాస్, తీరం శెట్టి కోటేశ్వరరావు, తిరుమలగిరి వజ్రం, గంగుల బిక్షం, పునాటి లక్ష్మీనారాయణ, కోలా రామస్వామి, సాదినేని శ్రీనివాసరావు, ఎండి షోయబ్, పల్నాటి జానకిరామ్ రెడ్డి, ఎండి షహనాజ్ బేగం, కోదాటి రమ, సూరయ్య, తుమ్మల ఫణికుమార్, పందిరి వేణు, జీడీఆర్ జానీ, సైదాచారి, రమావత్ వినోద్, వీర నాయక్, వల్లంపట్ల వినోద్, చిత్రం ఉమా తదితర బీఆర్ఎస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

# ర్యాకల్ దేవ్ పల్లిలో ఘనంగా జాతీయ యోగా దినోత్సవం

**మానసిక ఒత్తిళ్లకు యోగాతో చెక్: సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్**

**మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని పిలుపు**



సుల్తానాబాద్, జూన్ 21(ది క్రైమ్ న్యూస్) : జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎలిగేడు మండలం ర్యాకల్ దేవ్ పల్లి గ్రామంలో ఆదివారం ఉదయం ప్రత్యేక యోగా, వ్యాయామ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ ముఖ్య అతిథిగా పాల్గొని, గ్రామ మహిళలతో కలిసి యోగాసనాలు మరియు వ్యాయామం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మద్దెల రమాదేవి మాట్లాడుతూ.. నిత్య జీవితంలో శారీరక వ్యాయామం అనేది కేవలం శరీర దృఢత్వానికే కాకుండా, మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ఎదురవుతున్న మానసిక ఒత్తిళ్లను జయించడానికి యోగా, ప్రాణాయామం వంటి ఆసనాలు అద్భుతంగా పనిచేస్తాయని తెలిపారు. ముఖ్యంగా మహిళలు గృహ, ఉద్యోగ బాధ్యతల వల్ల కలిగే ఒత్తిడిని దూరం చేసుకోవడానికి ప్రతిరోజు తప్పనిసరిగా ప్రాణాయామం చేయాలని ఆమె సూచించారు. నేటి సమాజంలో మహిళలు దేంట్లోనూ తక్కువ కాదని, అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉంటూ తమ ప్రతిభను చాటాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొడిగ శివకృష్ణ గౌడ్, అంగన్వాడీ టీచర్ ఓదేశ్వరి, ఫీల్డ్ అసిస్టెంట్ సాగర్ మరియు గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఘనంగా 12వ అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలు



లక్షెట్టిపేట, జూన్ 21 ( ది క్రైమ్ న్యూస్) : అదియోగ సాధనా కేంద్రం లక్షెట్టిపేట వారి ఆధ్వర్యంలో ఆదివారం యోగ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న యోగా గురువులు భగవాన్ దాస్ మాట్లాడుతూ.. యోగ సాధన వలన మానసిక ప్రశాంతత,ఒత్తిడి లేని జీవితం, ఆరోగ్య కరమైన జీవితం లభిస్తుందని యోగా గురువులు తెలియజేశారు. అలాగే యోగ గురువులు రాచకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ.. యోగ అనేది ఒక జాతికి మతానికి చెందినది కాదని ఇది మానవాళి అందరకు సంబంధించిన ఒక ఆరోగ్య కరమైన సమాజ నిర్మాణానికి ఉపయోగ పడే ప్రక్రియ అని తెలియజేశారు. యోగా ట్రైనర్ నారి శెట్టి మంగ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న సమాజంలో అందరికీ ఆరోగ్యం అవసరం కాబట్టి ప్రతి ఒక్కరు ప్రతిరోజు కొంత సమయం యోగాకు కేటాయించి ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. ఆది యోగ శిబిరం లక్షెట్టిపేట సభ్యులు నిత్యం యోగా ఆసనాలు నేర్పిస్తున్న గురువులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో యోగా సభ్యులు చింతల శ్రీనివాస్, ప్రభాకర్, గురవయ్య, రాజన్న, రమేష్, చంద్రశేఖర్, బాపన్న, శ్రీనివాస్, సప్తగిరి, సతీష్, రాజేశం, సంతోష్, సురేష్, తిరుపతి, ప్రకాష్, మహిళా సభ్యులు శ్రీదేవి, కల్పన, నలిని, స్వాతి, కవిత, లత పలువురు పాల్గొన్నారు.

## ప్రజల సుఖ సంతోషాల కోసమే పెద్దమ్మ తల్లి బోనాలు

**-ముదిరాజ్ సంఘం అధ్యక్షులు చీకటి తిరుపతి**


లక్షెట్టిపేట, జూన్ 20: ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, అమ్మ వారి దీవెనలు అందరిపై ఉండేలా చూడాలని కోరుతూ పెద్దమ్మ తల్లి బోనాలు నిర్వహించడం జరుగుతోందని ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షులు చీకటి తిరుపతి అన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గోదావరి రోడ్డు లోని పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద మహిళ భక్తులు ప్రత్యేక బోనాలతో అమ్మవారికి మొక్కలు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు చీకటి తిరుపతి మాట్లాడుతూ.... సమాజంలో అందరూ బాగుండాలని కోరుతూ వర్షాకాలం ప్రారంభం ముందు అమ్మవారికి బోనాలతో మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. తొలకరి జల్లుల పలకరింపుతో రైతులు పొలాల పనుల్లో నిమగ్నయ్యే క్రమంలో సర్వ జీవ కోట్ల క్షేమాన్ని కోరుతూ ప్రత్యేక మొక్కులు చెల్లిస్తున్నామని వెల్లడించారు. ఎప్పటి లాగే ఈ ఏడాది కూడా వర్షాలు సంవృద్ధిగా కురువాలని మొక్కుకున్నట్లు తెలిపారు. అంతకుముందు యాట పిల్లలతో డప్పు చప్పుల్ల మధ్య బోనాలతో పెద్దమ్మ తల్లి ఆలయానికి భక్తులు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో. గడ్డం కొమరయ్య. చీకటి వెంకటేష్. కంకణల రాజు శిరవేణి శంకర్. ఐతర వేణి లచ్చన్న చీకటి సతీష్ . కుల సంఘ సభ్యులు పాల్గొన్నారు

# సంపాదకీయం

## ఆత్మవిమర్శ చేసుకునే సమయమిది !

భారతదేశం 79వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న వేళ..పాలకులు, ప్రభుత్వసంస్థలు ఆత్మవిమర్శ చేసుకుని ముందుకు సాగాల్సి ఉంది. మనం నిజాయితీగా పాలన చేస్తున్నామా అని కేంద్ర, రాష్ట్ర పాలకులు ఆలోచన చేయాలి. ఇన్నేళ్లయినా ఇంకా దరిద్రం తొలగిపోలేదు. ఇన్నేళ్లయినా ఇంకా పేదలు పేదలుగా ఉండి పోతున్నారు. పెద్దలు మరింత పెద్దలుగా మారుతున్నారు. ఆస్తులు, అంతస్తులు, డబ్బులు కొద్ది మంది వద్దే పరిమితం అవుతున్నాయి. ఇలా ఎందుకు జరుగుతుందో ఆలోచన చేయాలి. పేదల ఆకలి తీర్చే పేరుతో దుబారాలు చేస్తున్నారు. రాజకీయ నేతలు తమ విలాసాలకు ప్రజాధానం వృధా చేస్తున్నారు. పెన్షన్లు పంచడానికి విమానాలు, ప్రత్యేక హెలికాప్టర్లు ఎక్కి ఊరేగుతున్నారు. 43 ఏళ్ల క్రితం కిలో రెండు రూపాయల బియ్యం ఇస్తే... ఇప్పుడు దాని ధర రూపాయికి పడిపోయింది. ఇలా అన్ని సరుకుల ధరలు పడిపోయాయా అంటే లేదు. పేదలు ఇంకా ఉన్నారంటే పాలకుల అసమర్థతగానే చెప్పుకోవాలి. సామాజిక సంక్షేమ పథకాల దుర్వినియోగం వంటి ఆరోపణలతో ఇటీవల ప్రజాస్వామ్య సమగ్రతపై నీలినీడలు కమ్మేశాయి. పాలన సక్రమంగా సాగడం లేదనడానికి ఈ పథకం ఒక్కటి చాలు. ఇకపోతే 79 ఏళ్ల తరవాత కూడా స్వేచ్ఛగా ఓటేయలేకపోతున్నాం. మనం ఓటేయడానికి వెళ్లే సరికి ఆ ఓటు ఎవరో ఒకరు వేసి పోతున్నారు. ఇదంతా కేవలం ఎన్నికల సంఘం అనుసరిస్తున్న లోపభూయిష్ట విధానంగానే చూడాలి. ఎందుకంటే పక్కాగా ఓటరు కార్డు నేటికీ అమల్లోకి రాలేదు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటేయాలన్న ఆంక్షలు లేవు. ఈ రెండు అమలయితే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. ఒకటి పక్కాగా ఓటరుకార్డు ఉండాలి. ప్రతి ఒక్కరూ విధిగా ఓటేయాలి. ఈ రెండు అంశాలపై ఎన్నికల సంఘం దృష్టి పెట్టాలి. ఆధార్, పాన్ కార్డు తరహాలో ఓటుకు పక్కా పర్మినెంట్ నంబరు ఉంటే ఇక దొంగ ఓట్ల ప్రసక్తి రాదు. 79వ స్వాతంత్ర్య దినోత్సవంజరుపుకుంటున్న వేళ ఎన్నికల సంఘం ఈ రెండు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. పాలకులు తామే నిరంతరంగా అధికారంలో ఉండేందుకు నానాగడ్డీ కరుస్తున్నారు. అదే ఇప్పుడు దొంగ ఓట్లు, బూతుల క్యాప్చర్ వంటి సమస్యలకు దారితీస్తోంది. దీనిని నివారించగలగాలి. దేశంలో ఓటరు జాబితాల తయారీ, సవరణ కసరత్తును చేపట్టే అధికారం ఎన్నికల సంఘాని ఉంది. ఇది నిరంతర ప్రక్రియ కూడా. ఓటరు జాబితాను ఏటా సవరించడంలో తప్పు లేదు. అయితే పర్మినెంట్ ఓటరు కార్డు ద్వారా చనిపోయిన వారి పేర్లు తొలగించేందుకుమాత్రమే సవరణ జరగాలి. 18 ఏళ్లు నిండిన వారు విధిగా ఓటరుగా నమోదు చేయించే ప్రక్రియ రావాలి. అంతే తప్ప ఓటరు జాబితా సవరణను పెద్ద తతంగంగా చేయరాదు. పర్మినెంట్ ఓటర్ కార్డు వస్తే..నిరంతరంగా మార్పులు చేర్పులు చేయాల్సిన అసరం రాకపోవచ్చు. ప్రపంచం లోనే అతిపెద్ద ప్రజాస్వామ్యదేశంగా భారతదేశం ఖ్యాతిని పొందింది. లక్షలాది మంది స్వేచ్ఛగా, నిష్పాక్షి కమైన ఎన్నికల ద్వారా సమర్థులైన నాయకులను ఎన్నుకునే అవకాశం మనదేశంలోనే ఉంది. శక్తివంతమైన ఎన్నికల పక్రియకు చాలా కాలంగా ప్రశంసలు పొందింది. అయితే, ఓటర్ల జాబితాలో అవకతవకలు, జెర్రీ మాండరింగ్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ట్యాంపరింగ్ వంటి ఆరోపణలు తరచూ వస్తున్నాయి. ఇవన్నీ తప్పకుండా సమీక్షించాల్సిన అసవరం ఉంది. భారత ప్రజాస్వామ్యంపై వాటి ప్రభావం, ఎన్నికల పక్రియలో ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు తక్షణ సంస్కరణలను పరిశీలించాల్సిందే. ఇటీవల బీహార్‌లో ఓటర్ల సవరణ సందర్భంగా పెద్ద ఎత్తున ఓటర్ల జాబితా తారుమారు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. నకిలీ ఓటర్లు లేదా చెల్లని చిరునామా గల ఓటర్లు, ఒకే అడ్రస్‌లో నమోదు చేసుకున్న బల్క్ ఓటర్లు, గుర్తించలేని ఫోటోలు ఉన్న ఓటర్లు, నకిలీలు, మొదటిసారి ఓటర్లను నమోదు చేసే ఫారం 6 దుర్వినియోగం వంటివాటిపై ఇసి నిష్పక్షపాతంగా విచారణ చేయాలి. ఇవన్నీ చక్కబెట్టుకుం టూనే.. స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత భారత ఎన్నికల కమిషన్ పైన ఉంది. అయితే తరచూ వస్తున్న ఇలాంటి ఆరోపణలపై స్పందించకపోవడంతో తీవ్రవిమర్శలు ఎదుర్కొంటోంది. ఇది ఎన్నికల కమిషన్ నిష్పాక్షికత, పారదర్శకత పట్ల అనుమానాలను లేవనెత్తుతోంది. స్పష్టంగా చదువ గలిగే ఓటర్ల జాబితాను అందించేందుకు నిరాకరించడం మరిన్ని అనుమానాలను రేకెత్తిస్తోంది. ఒక పార్టీకి అనుకూలంగా నియోజకవర్గ హద్దులను తారుమారు చేసే పద్ధతిపైనా ఇసి దృష్టి సారించాలి. తమకు అనుకూలమైన ఫలితాలు రాబట్టేందుకు నియోజకవర్గాల రూపురేఖలు మార్చేందుకు ఆయా రాష్ట్రాల్లో ఉన్న పాలకులు వ్యూహాత్మకంగా కొత్త ఓటర్లను చేర్చడమో, తొలగించడమో చేస్తున్నట్లు తరచూ ఆరోపణలు వస్తున్నాయి. ఓటర్ల జనాభాలో చిన్నమార్పు ఫలితాలను నిర్ణయించే అవకాశం ఉంటుంది. డీలిమిషన్ పక్రియలో పారదర్శకత లేకపోవడం, ఈ సమస్య పరిష్కారానికి ఇసి విముఖత చూపించడం వల్ల, అధికార పార్టీ ఎన్నికల సరిహద్దులు తనకు అనుకూలంగా మార్చి, పాలనా పక్రియపై తన ప్రభావం చూపుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. భారత ఎన్నికలలో ఇవిఎం ట్యాంపరింగ్ ఆరోపణలు ఎంతో కాలంగా వివాదా స్పదంగా మారాయి. ఈ మధ్య ఓటర్ల జాబితా తారుమారు కీలక అంశం అయింది. అయితే ఇవిఎంల ట్యాంపరింగ్‌కు కచ్చితమైన ఆధారాలు లేవు. ఓట్ల లెక్కింపులో పారదర్శకతను నిర్ధారించే వివి పాట్‌లను విస్తృతంగా ఉపయోగించాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను ఎన్నికల కమిషన్ పట్టించుకోకపోవడం ఎన్నికల వ్యవస్థపై నమ్మకాన్ని క్షీణింపజేస్తోంది. అలాగే ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను దుర్వినియోగం చేస్తున్నదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రత్యక్ష నగదు బదిలీ, సబ్సిడీతో ఆహారం, ఇళ్ల నిర్మాణ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను ఓటర్లను, ముఖ్యంగా గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలను ఆకట్టుకునే సాధనాలుగా మారాయి. ఇలాంటి ఉచిత పథకాలపైనా ఇసి దృష్టి సారించాలి. ఈ పథకాలు పేదల స్థితిగతులను మెరుగుపరచేందుకే అని చెబుతున్నా అధికార,ప్రతిపక్షపార్టీలు మాత్రం వ్యూహాత్మకంగా ఎన్నికలే లక్ష్యంగా ప్రకటనలు చేస్తున్నాయి. ఓటర్ల జాబితా తారుమారు, జెర్రీ మాండరింగ్, ఇవిఎంలపై అనుమానాలు, సంక్షేమ పథకాల దుర్వినియోగాల ప్రభావం భారత ప్రజాస్వామ్య పక్రియ చట్టబద్ధతకు తీవ్ర ముప్పును కలిగిస్తున్నాయి. ఎన్నికల కమిషన్ నిష్పాక్షికంగా వ్యవహరించలేకపోతే ప్రజాస్వామ్యం లేదనే చెప్పాలి. ఎన్నికల వ్యవస్థ పక్షపాత ధోరణితో ఉందన్న ఆరోపణలకు ఇసి జవాబుదారీగా ఉండాలి. సమస్యలపై ఆరోపణలు రాగానే నిజాయితీగా నిలబడాలి. విమర్శలకు జవాబు ఇవ్వాలి. అప్పుడే మన ప్రజాస్వామ్యం బలపడుతుంది. భారతదేశ ప్రజాస్వామ్య పరిరక్షణకు తక్షణ సంస్కరణలు అవసరం అన్న విషయం గుర్తిస్తేనే మనం మరింత బలంగా మనుగడ సాధించగలం.

# పాకిస్తాన్‌లో అపారమైన ఖనిజ సంపద



### దీంతో వ్యాపారంచేయాలని పాక్ తహతహ
### విదేశీ పెట్టుబడుల ఆకర్శణకుప్రత్యేక కార్యాచరణ

ఇస్లామాబాద్ : ప్రస్తుతం పాకిస్తాన్ ఆర్థికంగా దివాలా తీసింది. ఇటీవలి ఆపరేషన్ సిందూర్‌తో మరింతగా పతనం అయ్యింది. సింధూజలాల నిలిపివేతతో దిక్కుతోచకుండా ఉంది. కానీ రానున్న రోజుల్లో మాత్రం ఈ దేశం సూపర్ రిచ్ కానుందని పలు నివేదికలు చెబుతున్నాయి. ఎలాగంటే దాదాపు 3 ట్రిలియన్ నుంచి 5 ట్రిలియన్ విలువైన అరుదైన ఖనిజాలు ఈ దేశంలో దాగి ఉన్నాయని భావిస్తున్నారు. ఇప్పుడు ఈ ఖనిజ సంపదను తవ్వి ప్రపంచ దేశాలతో వ్యాపారం చేయడానికి పాకిస్తాన్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అమెరికా, చైనా, సౌదీ అరేబియా, యూకే, టర్కీ యూఏఈ లాంటి దేశాలు ఈ అవకాశం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. పాకిస్తాన్‌లో బొగ్గు, రాగి, బంగారం, ఇనుము, క్రోమైట్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఇంకా చెప్పాలంటే, ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఉప్పు గనులు, ఐదో అతిపెద్ద రాగి, బంగారం గనులు ఇక్కడే ఉన్నాయంటా. ఈ ఖనిజాలు బలూచిస్తాన్ భూభాగం నుంచి ఉత్తరాన ఉన్న పర్వత ప్రాంతాలు, పంజాబ్ సారవంతమైన భూములు, సింధ్ భూముల వరకు అన్ని ప్రాంతాల్లో దొరుకుతాయని చెబుతున్నారు. ఇంత సంపద ఉన్నా కూడా ఇప్పటివరకు ఈ గనులను సరిగ్గా వినియోగించలేదు. కానీ, ఇప్పుడు ఈ విషయంలో పెద్ద మార్పు రాబోతోంది. అంతర్జాతీయ పెట్టుబడులను సులభతరం చేయడానికి, ఈ గనుల నిర్వహణను ప్రాంతీయ అధికారం నుంచి కేంద్ర అధికారానికి మార్చాలని పాకిస్తాన్ ప్రభుత్వం భావిస్తోంది. దీనికోసం రాజ్యాంగ సవరణ అవసరం. దానికి సంబంధించిన చట్టం ఇప్పుడు సమీక్షలో ఉంది. ఈ మార్పు వస్తే, విదేశీ కంపెనీలకు బిడ్డింగ్, రెగ్యులేటరీ అనుమతులు, సెక్యూరిటీ క్లియరెన్స్‌లు సులభంగా జరుగుతాయి. అంటే పెట్టుబడులు వేగంగా రానున్నాయని అంచనా వేస్తున్నారు. నివేదికల ప్రకారం రాబోయే ఆరు నుంచి ఎనిమిది నెలల్లో విదేశీ కంపెనీలతో ఒప్పందాలు ఖరారు కానున్నాయి. గిల్గిట్-బల్టిస్తాన్ ప్రాంతంలో ఖనిజాల తవ్వకం హక్కులు పొందే అవకాశం కోసం చైనా ఎదురు చూస్తోంది. చైనా ఇప్పటికే పాకిస్తాన్‌లో అనేక ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెడుతోంది. ఉత్తర బెలూచిస్తాన్, దక్షిణ ఖైబర్ పఖ్తూన్‌ఖ్వాలో మైనింగ్ ప్రాజెక్టులను అభివృద్ధి చేసే హక్కులు పొందవచ్చని అమెరికా భావిస్తోంది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా పాకిస్తాన్ ఖనిజ, ఇంధన రంగాలపై ఆసక్తి చూపారని తెలుస్తోంది. రేకో డిక్ రాగి-బంగారం గనులపై సౌదీ అరేబియా దృష్టి సారించింది. ఈ గనులు ప్రపంచంలోనే అత్యుత్తమ రాగి, బంగారం నిక్షేపాలలో ఒకటిగా పరిగణించ బడతాయి. సౌదీతో చర్చలు దాదాపు చివరి దశలో ఉన్నాయని అంటున్నారు. పాకిస్తాన్ ఇప్పుడు అమెరికా, యూకే, చైనా, సౌదీ అరేబియా, టర్కీ, యూఏఈ లాంటి దేశాల నుంచి వచ్చే పెట్టుబడిదారులతో డీల్స్ కుదుర్చుకుంటోంది. వీటి కోసం ప్రభుత్వం ఒక సులభమైన వన్-స్టాప్ సొల్యూషన్ సిస్టమ్‌ను తీసుకొస్తోంది. తద్వారా పెట్టుబడిదారులకు అన్ని అనుమతులు, సౌకర్యాలు ఒకే చోట దొరుకుతాయి. ఈ ఖనిజ సంపద పాకిస్థాన్ దేశ ఆర్థిక వ్యవస్థను మార్చగల సామర్థం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ గనులు సరిగ్గా వినియోగించబడితే ఉద్యోగాలు, ఆదాయం, ఆర్థిక అభివృద్ధి వంటి అనేక ప్రయోజనాలు లభిస్తాయి. అప్పుడు ఏకంగా పాక్ గతి మారుతుందని, ఆర్థికంగా బలపడుతుందని అంచనా వేస్తున్నారు.

## గుడ్ న్యూస్ చెప్పిన కాగ్నిజెంట్.. 80 శాతం మంది ఉద్యోగులకు జీతాల పెంపు

ఆర్థిక అస్థిరతతో గ్లోబల్ మార్కెట్లలో ఒత్తిడి, లాభాల క్షీణత, ఏఐ వినియోగం పెరగడం.. వంటి కారణాలతో ఖర్చు తగ్గింపులో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా ఐటీ సంస్థలు తమ ఉద్యోగులను లేఆఫ్స్ ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఐటీ ఉద్యోగుల్లో లేఆఫ్స్ గుబులు నెలకొంది. ఇలాంటి సమయంలో ప్రముఖ ఐటీ సేవల కంపెనీ కాగ్నిజెంట్ తమ ఉద్యోగులకు గుడ్‌న్యూస్ చెప్పింది. 80 శాతం మంది అర్హులైన ఉద్యోగులకు వేతనాలు పెంచనున్నట్లు ప్రకటించింది. రెండో త్రైమాసిక ఆదాయాలపై ప్రకటన సందర్భంగా సంస్థ గురువారం ఈ విషయాన్ని వెల్లడించింది. ప్రతిభ ఆధారంగా 80 శాతం అర్హులైన ఉద్యోగులకు జీతాలు పెంచుతున్నట్లు పేర్కొంది. ఈ పెంపు నవంబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని గురువారం ప్రకటించింది. ఈ జీతాల పెంపు సీనియర్ అసోసియేట్ స్థాయి హోదా వరకూ ఉంటుందని తెలిపింది. అయితే, ఎంత మొత్తంలో హైక్ ఉంటుందన్నది మాత్రం వెల్లడించలేదు. ఉద్యోగి పనితీరు, వచ్చిన రేటింగ్ ఆధారంగా నిర్ణయించనున్నట్లు స్పష్టం చేసింది.

## నా భర్తను చంపిన గ్యాంగ్‌స్టర్‌ను.. యోగి ఆదిత్యనాథ్ మట్టుబెట్టారు

### సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే

లక్నో: యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌పై .. సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే పూజా పాల్ ప్రశంసలు కురిపించారు. తన భర్తను చంపిన గ్యాంగ్‌స్టర్ అతిక్ అహ్మద్‌ను.. యోగి ఆదిత్యనాథ్ మట్టుబెట్టారని, దానికి థ్యాంక్స్ చెబుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. యూపీ అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. సీఎం యోగి న్యాయం అందించారని, తన వేదనను ఎవరూ పట్టించుకోకున్నా.. ఆయన స్పందించారని, రాష్ట్ర రాజకీయాల్లో జీరో టాలరెన్స్ తీసుకువచ్చినట్లు ఆమె తెలిపారు. విజన్ డాక్యుమెంట్ 2047పై ఆమె ప్రసంగించారు. తన భర్త రాజ్ పాల్‌ను ఎవరు మర్డర్ చేశారో ప్రతి ఒక్కరికీ తెలుసు అని, తనకు న్యాయం చేసిన సీఎంకు ధన్యవాదులు చెబుతున్నట్లు ఆమె చెప్పారు. అతిక్ అహ్మద్ లాంటి నేరస్తులను చంపి ప్రయాగ్‌రాజ్‌లోని తన లాంటి ఎంతో మంది మహిళలకు సీఎం న్యాయం చేశారని ఎమ్మెల్యే పూజా పాల్ తెలిపారు. బీఎస్పీకి చెందిన మాజీ ఎమ్మెల్యే రాజు పాల్‌ను 2005, జనవరి 25వ తేదీన హత్య చేశారు. పూజా పాల్‌ను పెళ్లి చేసుకున్న కొన్ని రోజులకే ఆ మర్డర్ జరిగింది. గ్యాంగ్‌స్టర్ అతిక్ అహ్మద్ సోదరుడు అష్రఫ్‌తో ఉన్న రాజకీయ విబేధాల వల్ల హత్య జరిగినట్లు పోలీసులు తెలిపారు. ప్రయాగ్‌రాజ్ వెస్ట్ సీటు నుంచి ఉప ఎన్నికల్లో పోటీ చేసిన అష్రఫ్‌ను రాజు ఓడించారు. దీంతో రాజును హతమార్చినట్లు తెలుస్తోంది. ఈ మర్డర్ కేసులో కీలక సాక్షిగా ఉన్న ఉమేశ్ పాల్‌ను ఫిబ్రవరి 2023లో మర్డర్ చేశారు. ఓ కేసులో అతిక్, అష్రఫ్‌ను అరెస్టు చేశారు. ప్రయాగ్‌రాజ్‌లో మెడికల్ చెకప్‌కు తీసుకెళ్తున్న సమయంలో ఆ ఇద్దరిపై అటాక్ జరిగింది. పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో అతిక్‌ను కాల్చేశారు. అష్రఫ్‌ను కూడా ఆ స్పాట్‌లోనే మర్డర్ చేశారు. అతిక్ కుమారుడు అసద్‌ను కూడా ఝాన్సీలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చంపేశారు.

# ట్రంప్ సుంకాలకు కారణాలు అనేకం




### కేవలం రష్యాతో చమురు బేరం మాత్రే కాదు
### విశ్లేషకుల లోతైన అంచనా

న్యూఢిల్లీ,ఆగస్ట్14 : ట్రంప్ భారీ సుంకాల విధింపు వెనక అనేకానేక కారణాలు ఉన్నాయని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. కేవలం రష్యా (నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై భారీగా సుంకాల భారాన్ని మోపారనడానికి లేదంటున్నారు. ఇదొకకారణం మాత్రమేనని, అలాంటివి ఎన్నో ఇప్పుడు ఆన ముందుకేసుకుని ఉన్నారని అంటున్నారు. ట్రంప్ సుంకాల విధింపుపై భారత మాజీ దౌత్యవేత్త వికాస్ స్వరూప్ మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్- పాక్ మధ్య జరిగిన కాల్పుల విరమణలో ఎవరి ప్రమేయం లేదని న్యూదిల్లీ పేర్కొనడంతోనే సుంకాలు విధించారని విమర్శించారు. ఈ వ్యవహారంలో ట్రంప్ పదేపదే పెద్దన్న పాత్ర పోషించినట్లు ప్రకటించుకున్నారు. అయితే భారత్ దీనిని ఖండించింది. ఇది కూడా ట్రంప్ ఆగ్రహానికి కారణంగా ఆయన చూపాలరు. భారత్‌పై ట్రంప్ సుంకాల భారం మోపడానికి ప్రధానంగా రెండు కారణాలు కన్పిస్తున్నాయని తెలిపారు. బ్రిక్స్ కూటమిలో భారత్ కూడా సభ్యదేశంగా ఉంది. ఈ కూటమి అమెరికాకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవడంతో పాటు- డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీని సృష్టించాలనే లక్ష్యంతో ఉందని ఆయన భావిస్తున్నారు. ఇది ఆయనకు నచ్చని అంశం. మరొకటి.. ఉద్రిక్తతల తర్వాత భారత్- పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. ఇది తానే చేశానని ట్రంప్ పదే పదే ప్రచారం చేసుకున్నారు. అయితే, కాల్పుల విరమణ చర్చల్లో మూడో దేశ ప్రమేయం లేదని భారత్ వాదిస్తోంది. దీనిపై ట్రంప్ అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. పాక్ ట్రంప్ ప్రమేయాన్ని గుర్తించడంతో పాటు-.. నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలంటూ ప్రతిపాదనలు కూడా చేసింది. అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చల్లో భారత వైఖరిని కూడా పలువురు ప్రశంసించారు. వ్యవసాయం, పాడి పరిశ్రమలపై అమెరికా ఒత్తిళ్లకు లొంగకపోవడం సరైన చర్యేనని అంటున్నారు. ఇకపోతే రష్యా నుంచి చమురు కొనుగోలు చేయొద్దని ట్రంప్ హెచ్చరించినా భారత్ పట్టించుకోలేదు. దీంతో భారీగా సుంకాలు విధించారు. ఇప్పటికే విధించిన 25 శాతం సుంకాలను 50 శాతానికి పెంచారు. ఆ 25 శాతం అదనపు టారిఫ్‌లు ఈనెల 27 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ గడువుకు ముందే యూఎస్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని న్యూదిల్లీ చర్చలు జరుపుతోంది. అయితే ఇవేవీ నిలవవని, ఇది అమెరికాకు కూడా నష్టం కలిగించేదే అని అంటున్నారు.

# కలయో.. వైష్ణవ మాయయో!..

తాను కాని జడములైన దేహాదులను తాను అనీ, తనవి అనీ భ్రాంతి పడటమే మోహం- అజ్ఞానం. ఆ భ్రమ తొలగటమే ప్రమ- యథార్థ జ్ఞానం. 'జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశితమాత్మనః' (గీత)- ఆ అజ్ఞానం పరమాత్మ జ్ఞానం కలిగితేనే నశిస్తుంది. అజ్ఞానం అంతరించడానికి జ్ఞానోదయం ఎలా అనివార్యమో, దేహాభిమాన నివృత్తికి, దైత్య వినాశనానికి భగవదవతారం అంత ఆవశ్యకం. అవతారం భగవంతునికి లీల- వినోదం. భక్తులకు తత్త్వజ్ఞాన ప్రదం- ప్రమోదం. ప్రాపంచికంగా లోకంలో ఏ విషయం విష సమానమో- దోషమో, పాపమో, దూషణమో, పరమాత్మ పరమైతే అదే అమృత తుల్యం- గుణము, పుణ్యము, భూషణమవుతుంది. తృష్ణ, కామ, లోభాది అశుభ వాసనలు కూడా కృష్ణ సంబంధితాలైతే ఆత్మీయ ఆభరణాలవుతాయి. మాధవాశ్రితము, అర్పితమూ అయిన ఏ విషయమైనా మహిమాన్వితమవుతుంది. కృష్ణచంద్రుని చోరత్వ జారత్వాలు కూడా ఆశ్రయ మహత్తం వలన చాటుమాటు పాపాలు పోగొట్టేవి, కోటికోటి పుణ్యాలు మూటకట్టేవిగా పరిణమిస్తాయి. శుక మహర్షి పరీక్షిత్తుతో.. రాజా! ఒకనాటి ప్రొద్దున వెన్నుడు- బాలకృష్ణుడు మన్ను తిన్నాడని రామన్న, ఇతర గొల్లపిల్లలు కన్నయ్యను తీసుకువచ్చి తల్లి యశోదతో వెల్లడించారు. ఆమె పాపని చేయి పట్టుకొని కోపం నటిస్తూ ఇలా అన్నది.'కన్నా! మన్నెందుకు తిన్నావురా? నేను అన్న (చెప్పిన) నియమాలను ఎందుకు మన్నించవు (పాటించవు)? బిడ్డా! తల అలా అడ్డంగా ఊపుతావేల? నీ అన్న రామన్న, నీ వెంట ఉన్న పిల్లలు అందరూ చెబుతున్నారు. అయినా, మట్టి తినవలసిన కర్మ నీకేమి పట్టిందిరా? ముద్దుల పట్టీ! (కొడుకా) తినడానికి ఇంట్లో వేరే గట్టి పదార్థాలే లేవా?' అంటూ చిన్నారి చిట్టి-చిట్టి చేతులను తన చేతిలోనికి తీసుకొని, రెండో చేతిలో బెత్తం పట్టుకొని ఝళిపిస్తూ మట్టి ఎందుకు తిన్నావో చెప్పమని రెట్టించి గట్టిగా గద్దించింది.




ఆధ్యాత్మికం

# యోగతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

## - ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి.



మిర్యాలగూడ, జూన్ 21: యోగాభ్యాసం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు ఆధ్యాత్మిక వికాసం కూడా సాధ్యమవుతుందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. 12వ అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంప్ గ్రౌండ్‌లో ఆరోగ్య భారతి మిర్యాలగూడ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగ దినోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా యోగాసనాలు చేసి, కార్యక్రమంలో పాల్గొన్న వారితో కలిసి యోగాభ్యాసం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ యోగ భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరమని పేర్కొన్నారు. యోగ కేవలం శారీరక ఆరోగ్యానికే పరిమితం కాకుండా మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆధ్యాత్మిక వికాసానికి కూడా ఎంతో దోహదపడుతుందని అన్నారు. ప్రస్తుత కాలంలో ఒత్తిడితో కూడిన జీవనశైలిలో ప్రతి ఒక్కరూ యోగను తమ దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. యోగాభ్యాసం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని, యువతతో పాటు అన్ని వయసుల వారు యోగను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత, క్రీడాకారులు, యోగా సాధకులు, సామాజిక కార్యకర్తలు, ప్రజలు పాల్గొని యోగాసనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య భారతి ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, క్రీడా సంఘాల నాయకులు, యోగా శిక్షకులు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామీణ విత్తనోత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



లక్షెట్టిపేట, జూన్ 21 : మండలంలోని చందారం గ్రామం సమీపంలో చందారం గ్రామ రైతు పొదుపు పరపతి, మార్కెటింగ్ పరస్పర సహాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ గ్రామీణ విత్తనోత్పత్తి, విత్తన శుద్ధి కేంద్రాన్ని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాంత రైతులకు నాణ్యమైన విత్తనాలు మార్కెటింగ్ కంటే తక్కువ రేటుకు సరైన ధరలకు అందించినప్పుడే రైతులకు న్యాయం చేస్తారన్నారు. సహకార సంఘం రైతులకు నాణ్యమైన విత్తనాలను తక్కువ రేటుకు అందించాలని సూచించారు.. మంచిర్యాల జిల్లాలో ఇతర నియోజకవర్గాల కంటే మంచిర్యాల నియోజవర్గం అభివృద్ధి దశలో ముందు ఉన్నదన్నారు. గతంలో పాలించిన ప్రభుత్వాల కంటే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అన్ని రంగాలలో అభివృద్ధి జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు రైతుల పక్షాన ఉంటుందని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపి భాస్కర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ, జిల్లా సహకార సంఘం అధికారి కరుణాకర్, వివిధ శాఖ చైర్మన్లు, సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, వార్డు మెంబర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, సంఘాల నాయకులు, రైతులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

# యోగా ఆరోగ్యానికి మేలు

## న్యాయమూర్తి యేగి జానకి.



ధర్మపురి, జూన్ 21, (ది క్రైమ్ న్యూస్) : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ధర్మపురి కోర్టు ఆవరణలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి యేగి జానకి మాట్లాడుతూ యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని ఆమె సూచించారు. యోగాభ్యాసం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని న్యాయమూర్తి తెలిపారు. అనంతరం న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో కలిసి యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ ఇమ్మడి శ్రీనివాస్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జాజాల రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బందేల రమేష్, వైస్ ప్రెసిడెంట్ మామిడాల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి రామడుగు రాజేష్, సీనియర్ న్యాయవాదులు గడ్డం సత్యనారాయణరెడ్డి, రౌతు రాజేష్, న్యాయవాది కలమడుగు హరిప్రసాద్, కోర్టు సూపరింటెండెంట్ భీష్మాచారి, ఇతర న్యాయవాదులు మరియు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శ్రీమతి

## పి. దేవి మానస ఆధ్వర్యంలో యోగా అవగాహన



ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవా సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి శ్రీమతి పి. దేవి మానస ఆధ్వర్యంలో యోగా అవగాహన మరియు సాధన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి ప్రధాన జిల్లా న్యాయమూర్తి డా. జి.వి. మహేష్ నాథ్ ముఖ్య అతిథిగా హాజరై యోగాభ్యాసం చేసి, యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇతర న్యాయాధికారులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ రమేష్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని యోగాసనాలు, ప్రాణాయామం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా శిక్షకురాలు శ్రీమతి సంధ్య, హైదరాబాద్ లాఫ్టర్ యోగా నేషనల్ యూనివర్సిటీ వ్యవస్థాపకులు శ్రీ మారికంటి వెంకట్‌లను సన్మానించి వారి సేవలను కొనియాడారు.

## ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాలు

# తెలంగాణకు చిరస్మరణీయం

## ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి.



మిర్యాలగూడ, జూన్ 21: తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ ప్రేరణకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని ఆయన విగ్రహానికి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అంకితభావంతో కృషి చేసిన మహోన్నత వ్యక్తి జయశంకర్ సార్ అని కొనియాడారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను దేశవ్యాప్తంగా చాటి చెప్పి, ఉద్యమానికి మేధోబలాన్ని అందించిన గొప్ప తాత్వికవేత్తగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి జయశంకర్ సార్ చేసిన సేవలు అమూల్యమైనవని, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జయశంకర్ సార్ ఆశయాల సాధనే ఆయనకు అందించే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, పట్టణ ప్రముఖులు పాల్గొని జయశంకర్ సార్‌కు ఘన నివాళులర్పించారు.


# ధర్మపురిలో ఘనంగా యోగ దినోత్సవం వేడుకలు



ధర్మపురి, జూన్ 21, (ది క్రైమ్ న్యూస్) : ధర్మపురిలో ఘనంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలో ని స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో దామెర జయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ - హైదరాబాద్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ దామెరా రామ సుధాకర్ రావు ఆధ్వర్యంలో స్థానిక గవర్నమెంట్ జూనియర్ కళాశాల మైదానంలో యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత, మహిళలు మరియు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని యోగా సాధన చేశారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవచ్చని వక్తలు తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని పాల్గొన్న ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# పేద కుటుంబానికి అండగా నిలిచి సొంతింటి కల నెరవేర్చిన ముఖ్యమంత్రి

## జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ): పేదల సంక్షేమం, అర్హులైన ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మానవతా దృక్పథంతో పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం నగరానికి చెందిన ఓ నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కేవలం 24 గంటల్లో స్పందించి డబుల్ బెడ్‌రూమ్ ఇంటిని కేటాయించడం ప్రజా సంక్షేమానికి నిదర్శనమని తెలిపారు. ఖమ్మం నగరానికి చెందిన విద్యార్థిని తురక దేవీప్రసన్న ఏఎస్ఆర్ ప్రభుత్వ కాలేజీలో చదువుతూ ఇంటర్ బైపీసీ ప్రథమ సంవత్సరంలో 434 మార్కులు రావడంతో పాటు జాతీయస్థాయి రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీల్లో ప్రథమస్థానం సాధించగా, హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో శుక్రవారం గవర్నర్ శివప్రతాప్ శుక్లా సమక్షంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా దేవీప్రసన్న రూ.50వేల నగదు, జ్ఞాపికను అందుకుందని అన్నారు. అట్టి సందర్భంలో ముఖ్యమంత్రి విద్యార్థిని పలకరించి, కుటుంబ పరిస్థితి తెలుసుకోగా, తన తండ్రి లేరని, తల్లి జ్యోతి ఎన్నో కష్టాలుపడి ఇద్దరు కుమార్తెలను చదివిస్తోందని, ఉండేందుకు కనీసం ఇల్లు లేదని తెలిసి చలించిన ముఖ్యమంత్రి, ఆ కుటుంబానికి రెండు పడక గదుల ఇంటిని మంజూరు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు కలెక్టర్ దివాకర టిఎస్ లను ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం వేగంగా స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించిందని, కుటుంబ పరిస్థితులను పరిశీలించిన అధికారులు, ఆ కుటుంబం నివాస సమస్యతో ఇబ్బందులు పడుతోందని నిర్ధారించిందని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఎలాంటి జాప్యం లేకుండా ఇంటి కేటాయింపు ప్రక్రియను పూర్తి చేసి, ఖమ్మం నగరంలోని వైఎస్ నగర్ డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయంలో రెండు పడక గదుల ఇంటిని కేటాయించినట్లు, శనివారం ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచందర్, దేవీప్రసన్న కుటుంబ సభ్యులకు ఇంటి కేటాయింపు ఉత్తర్వులను అందజేశారన్నారు. అధికార యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎవరికైనా సమస్య ఉంటే ప్రభుత్వం తప్పకుండా అండగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చివరి అర్హుడి వరకు చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం వేగంగా స్పందించి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చిన తీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల కష్టాలను అర్థం చేసుకుని వెంటనే పరిష్కారం చూపడం అభినందనీయమని పేర్కొంటూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఐదవ రోజు ఘనంగా మొహర్రం వేడుకలు...



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో జూన్ 21 (ది క్రైమ్ న్యూస్) : కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం రాజారాం గ్రామపంచాయతీలో కొలువై ఉన్న పీరీలు ఎంతో మహిమలతో అత్యంత పవిత్రమైనదిగా ప్రజలు భావిస్తారు. కుల మతాలకు తేడా లేకుండా భక్తిశ్రద్ధలతో ఈ మొహరం పండుగను రాజారాం గ్రామ ప్రజలు జరుపుకుంటారు. మొహర్రం పండుగలో ఐదవ రోజు పంచమిని ఎంతో అంగరంగ వైభవంగా మలీదలు, పూలు, పండ్లు, బెల్లం తో తయారైన శెర్బత్ ను పీరీల నిర్వహణ కమిటీ పెద్ద షేక్ అబ్దుల్లా ఇంటి నుండి తెచ్చి పీరీలకు నైవేద్యంగా పెట్టారు. పీరీల నిర్వహణ కమిటీ పెద్ద షేక్ అబ్దుల్లా మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి రాజారం గ్రామంలో కొలువుదీరిన పీరీలు ఎంతో మహిమలతో కూడినవి అని కొనియాడారు. మంగళవారం రోజున చిన్న శరిగత్, గురువారం రోజు పెద్ద శరిగత్, శుక్రవారం రోజు పీరీల నిమజ్జనం ఉంటుందని ఆయన తెలిపారు. చుట్టుప్రక్కల ఉన్న గ్రామాల నుండి ప్రజలు వచ్చి పీర్ల ప్రతిమలను ఊరేగిస్తూ భక్తి ప్రపత్తులతో ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకుని, మతాలకు అతీతంగా ప్రజలు ఒకరికొకరు తోడుగా ఉంటూ సామరస్యంగా వేడుకలు జరుపుకుంటారు అని ఆయన అన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ): 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల తనికెళ్ళ మండలం నందు ఖమ్మం మేరా యువ భారత్ ఆధ్వర్యంలో ఘనంగా యోగ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల ప్రిన్సిపాల్స్ రజిని, మేరా యువ భారత్, జిల్లా యువజన అధికారి ఎం. వెంకట్ రాంబాబు మరియు కే. భానుచందర్, జాగృతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ సయ్యద్ షారుక్ ఇమ్రాన్ వారు మాట్లాడుతూ అంతర్జాతీయ యోగ దినోత్సవము ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకుంటారు. 2014 సెప్టెంబరు 27న భారత ప్రధాని నరేంద్రమోడి ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ప్రతిపాదన చేశారనీ, ఈ తీర్మానానికి 193 ఐరాస ప్రతినిధులలో 175 మంది మద్దతు ఇచ్చారనీ, యోగా అనేది మానవులకు మంచే కలుగజేస్తుందని, యోగ ప్రతిరోజు చేయడం వలన జీర్ణ వ్యవస్థ రక్త ప్రసరణ వ్యవస్థ మెరుగుపడుతుందని సకల రోగాలకు బెడ్ పెడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ డిపార్ట్మెంట్ యోగా మాస్టర్ పి. సంధ్య శరీర, మానసిక ఆరోగ్యానికి యోగాసనాలు ఎంతో మేలు చేస్తాయి. ఇవి ఒత్తిడిని తగ్గించి, కండరాలను దృఢపరుస్తాయి. తడాసనం, వజ్రాసనం, భుజంగాసనం, విద్యార్థులతో యోగ ఆసనాలు వేయించడం జరిగింది. ఒత్తిడి, ఆందోళనలను దూరం చేసి మనస్సుకు ప్రశాంతతను ఇస్తుంది అని అన్నారు. మరియు కొంతమంది విద్యార్థులు వ్యాస రచన పోటీలలో పాల్గొనగా అందులో మొదటి మరియు ద్వితీయ బహుమతులు అందజేయడం జరిగింది. పి.ఇ.టి, రమ్య అనంతరం విద్యార్థులతో యోగ ఆసనం లోగో ప్రదర్శించడం జరిగింది. కార్యక్రమానికి సహకరించిన ప్రిన్సిపాల్ గారికి మేరా యువ భారత్ మరియు జాగృతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ధన్యవాదాలు తెలిపారు.

# ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు కీలక బాధ్యతలు

న్యూఢిల్లీ : ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు తాజాగా కీలక బాధ్యతలు లభించాయి. టెర్రరిస్టుల ఆర్థికమూలాలు, అక్రమ నగదు రవాణా నెట్వర్క్‌లను దెబ్బతీసేందుకు ఏర్పాటు చేసిన ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్)కు వైస్‌ప్రెసిడెంట్‌గా మధ్యప్రదేశ్ కేడర్ ఐఏఎస్ అధికారి వివేక్ అగర్వాల్ ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఉగ్రవాదులకు నిధులు అందకుండా అంతర్జాతీయంగా చేపడుతున్న చర్యల్లో భారత్‌కు పెరుగుతున్న ప్రాధాన్యానికి ఇది నిదర్శనమని రణధీర్ జైస్వాల్ చెప్పారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు ఇది ఒక భారీ విజయమని వ్యాఖ్యానించారు. ఎఫ్ఏటీఎఫ్‌లో ఒక భారత అధికారికి ఇంతటి కీలక బాధ్యతలు దక్కడం ఇదే తొలిసారి. ఐఏఎస్ అధికారి వివేక్ అగర్వాల్ ప్రస్తుతం కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సెక్రటరీగా ఉన్నారు. అంతకుముందే, కేంద్ర ప్రభుత్వంతో పాటు పంజాబ్, మధ్యప్రదేశ్‌లో వివిధ స్థాయిల్లో పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. మధ్యప్రదేశ్ కేడర్‌లో చీఫ్ సెక్రటరీ గ్రేడ్ అధికారిగా 2025లో పదోన్నతి సాధించారు. గతంలో ఆయన రెవెన్యూ శాఖ అడిషనల్ సెక్రటరీగా ఉన్నారు. ÷నాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ డైరెక్టర్‌గా కూడా సేవలందించారు. పరిపాలన, ఆర్థిక అంశాల నిర్వహణలో విశేష గుర్తింపు పొందారు. పంజాబ్ యూనివర్సిటీ నుంచి బీకామ్, ఎల్ఎల్‌బీ చేసిన ఆయన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీస్ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా నుంచి సీఎస్(ఇంటర్) కూడా చేశారు.

# ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం సీఎం సహాయ నిధి

### పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలు అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తంలా నిలుస్తోందని, అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక స్థోమత లేక చికిత్స పొందలేని నిరుపేదలకు ఈ నిధి ఎంతో ఆర్థిక భరోసా కల్పిస్తోందని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ వివరించారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని గచ్చిబౌలికి చెందిన హర్షవర్ధినికి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయగా, ఆ నిధి ద్వారా రూ.2 లక్షల 50 వేల ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మేరకు మంజూరైన సహాయ పత్రాన్ని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ, తాజా మాజీ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరమని అన్నారు. అత్యవసర వైద్య చికిత్స కోసం దరఖాస్తు చేసుకున్న హర్షవర్ధినికి రూ.2 లక్షల 50 వేల ఆర్థిక సాయం మంజూరు కావడం సంతోషకరమని తెలిపారు. ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని గాంధీ పేర్కొన్నారు. వైద్య చికిత్సకు సహకారం అందించి, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం మంజూరు చేయించడంలో కృషి చేసిన ఆరెకపూడి గాంధీకి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్, లింగం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# బచ్చోడు గ్రామంలో శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని వెంటనే పునర్ నిర్మించండి

### సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్



ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : బచోడు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకొని ప్రజలకు ప్రమాదకరంగా మారిందని, దీనిని వెంటనే వేరే ప్రదేశానికి మార్చి నూతన భవనాన్ని నిర్మించి కామన్ హెల్త్ సెంటర్‌గా ఏర్పాటు చేయాలని సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలు అందించాల్సిన ఆరోగ్య ఉప కేంద్రం నిర్లక్ష్యానికి గురై శిథిలావస్థకు చేరుకోవడం దురదృష్టకరమన్నారు. వర్షాకాలంలో భవనం మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, పాత భవనాన్ని తొలగించి అన్ని మౌలిక సదుపాయాలతో కూడిన నూతన భవనాన్ని నిర్మించి, అవసరమైన వైద్య సిబ్బంది, మందులు, పరికరాలను అందుబాటులో ఉంచుతూ కామన్ హెల్త్ సెంటర్‌గా అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. అలాగే గ్రామ ప్రజలకు ఎటువంటి అంతరాయం లేకుండా వైద్య సేవలు కొనసాగించేలా తాత్కాలిక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. బచోడు గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ఈ కేంద్రాన్ని బలోపేతం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోకపోతే గ్రామ ప్రజలను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని గొర్రెపాటి రమేష్ హెచ్చరించారు.

# ప్రతి పోలీసు అధికారి యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలి: సైబరాబాద్ సీపీ



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సైబరాబాద్ సీపీ కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమం "ఆరోగ్యం, సన్నద్ధత, మానసిక దృఢత్వం కోసం యోగా" అనే భావంతో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్‌తో పాటు సుమారు 250 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని యోగా సాధన చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీపీతో పాటు అధికారులు, సిబ్బంది యోగా ఆసనాలు, ప్రాణాయామం, ధ్యాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ యోగా అనేది భారతీయ నాగరికత ప్రపంచానికి అందించిన అమూల్యమైన వారసత్వమని తెలిపారు. యోగా సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా శరీరంలోని అన్ని అవయవాలు సమర్థవంతంగా పనిచేస్తాయని పేర్కొన్నారు. పోలీసు విధుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా అత్యంత ముఖ్యమని సీపీ తెలిపారు. ప్రశాంతమైన మనస్సు, దృఢమైన శరీరం, సురక్షితమైన సమాజ నిర్మాణానికి పునాది అని పేర్కొంటూ ప్రతి పోలీసు అధికారి ఆరోగ్యవంతమైన శరీరం, ఏకాగ్రత కలిగిన మనస్సును పెంపొందించుకోవాలని సూచించారు. యోగా ద్వారా మానసిక బలం పెరిగి, ప్రశాంతమైన మనస్సుతో స్పష్టమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెరుగుతుందని అన్నారు. శ్వాసపై దృష్టి కేంద్రీకరించడం ద్వారా మనస్సు ప్రశాంతంగా మారి, ఒత్తిడిని అధిగమించే శక్తి లభిస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయం యోగా, ప్రాణాయామం, ధ్యానం కోసం కేటాయించాలని సూచించారు. పోలీసు విధులు అధిక ఒత్తిడితో కూడుకున్నవని, అందువల్ల ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమ దినచర్యలో యోగాను భాగం చేసుకోవాలని సీపీ పిలుపునిచ్చారు. శారీరక దృఢత్వం, భావోద్వేగ సమతుల్యత, వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా మరింత సమర్థవంతమైన పోలీసింగ్ సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. ఆరోగ్యవంతమైన పోలీసు వ్యవస్థ ద్వారానే మెరుగైన పోలీసింగ్ అందించవచ్చని సీపీ స్పష్టం చేశారు.

# రైతు సంక్షేమం దిశగా ప్రభుత్వం చర్యలు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



లక్సెట్టిపేట, జూన్ 21 : రైతు సంక్షేమం దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని లక్సెట్టిపేట మండలం దౌడేపల్లి (చందారం) లో చందారం గ్రామ రైతు పొదుపు, పరపతి, మార్కెటింగ్ పరస్పర సహాయక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ గ్రామీణ విత్తన ఉత్పత్తి – విత్తన శుద్ధి కేంద్రాన్ని డి.సి.పి. ఎ.భాస్కర్, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, సంబంధిత అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమం దిశగా అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. జిల్లాలోని రైతుల కొరకు విత్తన ఉత్పత్తి – విత్తన శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇందు కొరకు అవసరమైన మెటీరియల్, ఎక్విప్మెంట్ సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా దాదాపు 2 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, ఇంకా 12 వేల క్వింటాళ్లు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అవసరమైన లారీలను సమకూర్చడం జరిగిందని, సింగరేణి సంస్థ, ఇసుక తరలింపు సంబంధిత లారీలను ధాన్యం కొరకు మళ్ళించడం జరిగిందని తెలిపారు. వర్షాలు రాకముందే ధాన్యం కొనుగోలు చేసి కేటాయించిన ప్రకారం గోదాములు, రైస్ మిల్లులకు తరలించడం జరిగిందని, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు చేసిన 48 గంటల వ్యవధిలో చెల్లింపులు చేయడం జరిగిందని, దాదాపు 98 శాతం ధాన్యం కొనుగోలు సంబంధించి ఆయా రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరిగిందని తెలిపారు. భూ సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడంతో పాటు రైతుల నమోదు ప్రక్రియ చేపట్టడం జరిగిందని, రైతు సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆధార్ లింకేజీ ద్వారా యూరియా, విత్తనాలు, ధాన్యం విక్రయ బుకింగ్ చేయడం జరుగుతుందని, సాదా బైనమా దరఖాస్తులను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. శాంతిభద్రతలు, సివిల్, కుటుంబ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు మారుమూల గ్రామాలలో సర్వే నిర్వహించడం జరుగుతుందని, పట్టాదారు, మోకా వివరాలు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అధికారుల సమన్వయంతో సర్వే ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, ఆధార్, భూధార్ ప్రక్రియ పరిశీలన పకడ్బందీగా చేపట్టే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. పంట సాగులో రైతులు లబ్ధి పొందే విధంగా పంట మార్పిడి విధానం, సాగు మెలకువలు, లాభాలు, భూసారం పరిరక్షణ, నానో యూరియా వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు తో పాటు దాదాపు 22 వేల టన్నుల మొక్కజొన్నలు కొనుగోలు చేయడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా 452 కోట్ల చెల్లింపులు కాగా మంచిర్యాల నియోజకవర్గంలో దాదాపు 270 కోట్ల చెల్లింపులు జరిగాయని తెలిపారు. ఈసారి ఐ.కె.పి. వారికి కొనుగోలు కేంద్రాలు కేటాయించడం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా 20 శాతం కొనుగోలు కేంద్రాలు ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. కడెం కాలువ 42వ డిస్టిబూటరీ నుండి నీటిని అందించడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో లారీలు, హమాలీల సమస్య లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని, గతంలో ఎకరాకు 20 నుండి 22 క్వింటాళ్లు ధాన్యం దిగుబడి రాగా ఈసారి 28 నుండి 32 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చిందని తెలిపారు. రైతులకు ఎలాంటి నష్టం లేకుండా కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం గోదాములకు తరలించి తగు చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, కొందరు ఉద్దేశపూర్వకంగా అసత్య ఆరోపణలతో రైతులను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, రైతు సంక్షేమంలో రాజకీయాలకు అతీతంగా కలిసి రావాలని తెలిపారు. పంట సాగుకు సరిపడా సాగునీరు అందించడం జరిగిందని, పంట ఉత్పత్తికి అవసరమైన గోదాములు ఏర్పాటు చేసి అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, విత్తన శుద్ధి కేంద్రం ద్వారా మార్కెట్ ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదు...

### జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్

- యోగతో ఆరోగ్యం... ఆరోగ్యంతో అందమైన జీవితం
- దైనందిన జీవితంలో యోగ ఒక భాగం కావాలి
- ప్రపంచ యోగా దినోత్సవంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ): ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదని, యోగతో ఆరోగ్యం సాధ్యమవుతుందని, ఆరోగ్యంతో అందమైన జీవితం సాధ్యపడుతుందని, ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగంగా అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. ఆదివారం స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో ఆయుష్, క్రీడల శాఖల ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం – 2026 కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ స్వయంగా యోగా ఆసనాలు చేస్తూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, యోగ అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, క్రమశిక్షణతో కూడిన జీవన విధానమని అన్నారు.యోగా దినమున జరిగే కార్యక్రమంలో ఆయుష్ శాఖ వారు పాల్గొనేవారని, ఇక్కడ పౌర సమాజం నుండి పెద్ద సంఖ్యలో పాల్గొనడం శుభసూచకమని అన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని తెలిపారు. ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, సాంకేతిక సౌకర్యాల పెరుగుదల కారణంగా మనిషి శారీరక శ్రమకు దూరమవుతూ అనేక రకాల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని అన్నారు. ప్రతి మనిషికి ఉన్న అత్యంత విలువైన ఆస్తి ఆరోగ్యం అని, ఆరోగ్యం బాగోలేకపోతే జీవితంలో ఎంత సాధించినా దానిని పూర్తిగా ఆస్వాదించలేమని తెలిపారు. ఆరోగ్యంగా ఉండటమే ప్రతి వ్యక్తి జీవితానికి బలమైన పునాది అని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, ఉప వైద్యాధికారి డా. వేణుమాధవ్, నోడల్ అధికారిణి డా. పద్మావతి, నేచురోపతి డాక్టర్ కనకమహాలక్ష్మి, జిల్లా అధికారులు, విద్యార్థులు, యువత, మహిళలు, యోగా సాధకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి అడుగు ఆరోగ్యవంతమైన జీవితానికి నాంది కావాలి

### తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్




క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి అడుగు ఆరోగ్యవంతమైన జీవితానికి నాంది కావాలని, ఈ 5కే రన్‌లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఆదివారం మియాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీల గార్డెన్ కాలనీలో గల శ్రీ లక్ష్మి ఇంపీరియా అపార్ట్‌మెంట్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన "రన్ ఫర్ గ్రీన్ 5కే రన్" కార్యక్రమాన్ని మియాపూర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా, వ్యాయామం, క్రమబద్ధమైన జీవనశైలితో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శ్రీ లక్ష్మి ఇంపీరియా అపార్ట్‌మెంట్స్ వాసులందరికీ శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన, పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. 5కే రన్‌లో అపార్ట్‌మెంట్ వాసులు, యువత, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడం ఆనందదాయకమని, ఆరోగ్యకర జీవన విధానం, పచ్చదనం పరిరక్షణకు అందరూ తమ వంతు మద్దతు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ కమిటీ సభ్యులు, కాలనీ ప్రముఖులు, నివాసితులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# యోగాను జీవన విధానంగా మార్చుకోవాలి : రవికుమార్ యాదవ్



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండాపూర్ బొటానికల్ గార్డెన్ పార్క్, గచ్చిబౌలి గోపనపల్లి తాండా కమ్యూనిటీ భవనం వద్ద ఆదివారం నిర్వహించిన ప్రత్యేక యోగా కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ యోగ అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, వేల సంవత్సరాల క్రితం మన ఋషులు ప్రపంచానికి అందించిన అమూల్యమైన సంపద అని అన్నారు. యోగ ద్వారా శరీరం, మనస్సు, ఆత్మకు సమతుల్యత లభిస్తుందని, ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృషితో 2014లో ఐక్యరాజ్యసమితి జూన్ 21ను అంతర్జాతీయ యోగ దినోత్సవంగా ప్రకటించిందని గుర్తు చేశారు. అప్పటి నుంచి ప్రపంచవ్యాప్తంగా యోగకు మరింత ప్రాధాన్యం పెరిగిందని, ఇది భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రపంచం ఇచ్చిన గౌరవమని పేర్కొన్నారు. ప్రస్తుత హడావిడి జీవితంలో ఒత్తిడి, అనారోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి కుటుంబం, ప్రతి పాఠశాల, ప్రతి గ్రామంలో యోగను జీవన విధానంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ రోజూ కనీసం 30 నిమిషాలు యోగ చేయాలని, కుటుంబ సభ్యులను కూడా యోగ వైపు ప్రోత్సహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యోగ గురు బల్బీర్ సింగ్, రాష్ట్ర నాయకులు హనుమంత్ నాయక్, బాల్దా అశోక్, ప్రభాకర్ యాదవ్, నాయకులు చంద్రశేఖర్ యాదవ్, ఆంజనేయులు సాగర్, శ్రీశైలం యాదవ్, దేవానంద్ యాదవ్, సురేష్, శివా సింగ్, వరలక్ష్మి, ఉమా, కిషన్ గౌలి, ప్రకాష్, పవన్, హర్షిత్, క్రాంతి తదితరులతో పాటు వాకర్స్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ 279 మందిపై కేసులు



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించి 279 మంది మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేశారు. ఈ విషయాన్ని సైబరాబాద్ ట్రాఫిక్ అదనపు డీసీపీ ట్రాఫిక్–1 జి. హన్మంతరావు వెల్లడించారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం పట్టుబడిన వారిలో 228 మంది ద్విచక్ర వాహనదారులు, 8 మంది ఆటో డ్రైవర్లు, 43 మంది కార్ డ్రైవర్లు ఉండగా, హెవీ వాహనదారులపై కేసులు నమోదు కాలేదు. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్‌ట్రేషన్ ఆధారంగా కేసులను మూడు విభాగాలుగా వర్గీకరించారు. అందులో 230 మంది 36 ఎంజీ/100 ఎంఎల్ నుంచి 200 ఎంజీ/100 ఎంఎల్ మధ్య, 33 మంది 201 ఎంజీ/100 ఎంఎల్ నుంచి 300 ఎంజీ/100 ఎంఎల్ మధ్య, 16 మంది 301 ఎంజీ/100 ఎంఎల్ నుంచి 550 ఎంజీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని, మద్యం మత్తులో డ్రైవింగ్ చేసి ప్రమాదానికి కారణమైతే భారతీయ న్యాయ సంహిత 2023 సెక్షన్ 105 కింద కేసు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. ఈ నేరానికి గరిష్టంగా 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, గత వారం (జూన్ 15 నుంచి జూన్ 20 వరకు) నమోదైన 622 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి. వీటిలో ఒకరికి జరిమానాతో పాటు సోషల్ సర్వీస్ శిక్ష, 621 మందికి జరిమానాలు విధించినట్లు ట్రాఫిక్ అధికారులు తెలిపారు. సైబరాబాద్ పోలీసులు ప్రజలు మద్యం సేవించిన తర్వాత వాహనాలు నడపకూడదని, కుటుంబాల భద్రత కోసం ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మరోసారి విజ్ఞప్తి చేశారు.

# ఓకట్లపాములతో చెలగాటం

హైదరాబాద్ : పాముతో చెలగాటం ఓ వ్యక్తి ప్రాణం తీసింది. స్నేహితులను భయపెట్టాలని ఆ వ్యక్తి చేసిన పిచ్చి పని అతని ప్రాణాలను బలితీసుకుంది. ఫామ్‌హౌస్‌లో కనిపించిన కట్లపాము పిల్లను చేతిలో తీసుకుని పరచకాలు ఆడటంతో.. అది కాటువేసింది. దీంతో అతను ప్రాణాలు కోల్పోయాడు. హైదరాబాద్‌లోని మొయినాబాద్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన నవాబ్ జయ్యద్ ఖుమైద్ మొహిద్దీన్ (30) ఒక వ్యాపారవేత్త. తన స్నేహితులతో కలిసి ఇటీవల మొయినాబాద్‌లోని ఒక ఫామ్‌హౌస్‌కు వెళ్లాడు. వారితో సరదాగా గడుపుతున్న సమయంలో అక్కడకు ఒక కట్లపాము పిల్ల వచ్చింది. దాన్ని చూడగానే నవాబ్ దాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు. ఆ పాముతో తన స్నేహితును భయపెట్టాలని అనుకున్నాడు. ఆ కట్ల పాముతో ఆటలు ఆడుతూ స్నేహితులను భయపెట్టబోయాడు. కానీ ఇంతలో కుడి చేతి బొటనవేలుపై కాటేసింది. చిన్న పాము కదా.. పెద్దగా ప్రమాదం ఉండదని వాట్ లైట్ తీసుకున్నాడు. స్నేహితుల ముందు నవ్వుకుంటూ.. తనకు ఎలాంటి ఇబ్బంది లేదని, చికిత్స అవసరం లేదని స్నేహితులతో చెప్పుకొచ్చాడు. కానీ చిన్నదైనా, పెద్దదైనా కట్లపాము విషం అత్యంత ప్రమాదకరమేని అతను తెలుసుకోలేకపోయాడు. ఇంకేముంది.. కొద్దిసేపట్లోనే కట్ల పాము విషం నవాబ్ శరీరంపై ప్రభావం చూపడం మొదలుపెట్టింది. ముందుగా శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారింది. క్రమంగా ఆరోగ్యం కూడా క్షీణించింది.

# విశ్వేజి




## బాధగా తింటున్నారా బరువు పెరుగుతారు!

బరువు తగ్గేందుకు ఆహారపు మోతాదు తగ్గించడం, పదార్థాల్లో మార్పులు చేసుకోవడం మాత్రమే కాదు. ఆహారం పట్ల మన దృక్పథాన్ని కూడా స్పష్టంగా, సానుకూలంగా ఉంచుకోవాలని చెబుతున్నారు పోషకాహార నిపుణులు. మనసు నిండా అపరాధ భావన పెట్టుకుని ఆరోగ్యకరమైనది తిన్నా సరే, అది శరీరానికి అనారోగ్యాన్నే చేకూరుస్తుందని అంటున్నారు. అందుకే బరువు తగ్గే క్రమంలో ఆహారంతో మన అనుబంధం ఎలా ఉండాలన్నదానికి సంబంధించి కొన్ని సూచనలు చేస్తున్నారు. మనసారా తినండి మైండ్‌ఫుల్‌నెస్ అనేది ఏ పనిలోనైనా ముఖ్యమే. అంటే చేస్తున్న పని మీద పూర్తి ఏకాగ్రత. అలాగే ఆహారం విషయంలోనూ. మనం ఏం తింటున్నాం, దాని రంగు, ఆకృతి, పోషకాలు, రుచి వీటన్నింటినీ అనుభవిస్తూ తినడం వల్ల పొట్టకు తిన్న అనుభూతితో పాటు శరీరానికి ఆరోగ్యం చేకూరుతుంది. బరువు తగ్గాలంటే ఇది ఈ సమయంలో ఇంతే తినాలిఅన్నట్టుగా కాకుండా, ఒక రోజు మొత్తంలోనో ఒక వారం మొత్తంలోనో మనం పూర్తి చేయవలసిన ఆహార లక్ష్యాలను పెట్టుకుని, వాటిని మనసుకు నచ్చిన వేళల్లో నచ్చిన విధంగా తినే ఏర్పాటు చేసుకుంటే పని సులభం అవుతుంది. చోడ్‌దో అప్పుడప్పుడు మనం టెంప్ట్ అయిపోయి తినవద్దు అనుకున్న ఆహారాన్ని కూడా తినేస్తుంటాం. అలాంటప్పుడు 'ఇంక ప్లాన్ మొత్తం నాశనం అయిపోయినట్టే' అని ఫీల్ అవ్వకుండా, ఇవాళ నాకు నచ్చిన ఆహారాన్ని ఎంజాయ్ చేశాను, రేపటి నుంచి మళ్లీ నా ప్రణాళికను అనుసరిస్తాను అనుకోవచ్చు. లేకపోతే అపరాధ భావనతో కీరాదోసకాయలాంటి ఆరోగ్యకరమైన దాన్ని తిన్నా, అది కూడా మన బరువు పెరిగేలా పనిచేస్తుంది. పూర్తిగా నములుతూ, నెమ్మదిగా, ఆకలిని గమనిస్తూ ఆహారం తీసుకోవడం అన్నది హాయిగా బరువు తగ్గేందుకు ఒక మంచి చిట్కా. ఇలా గమనించడం వల్ల నిజమైన ఆకలి లేదా ఊరికే ఆకలిలాగా కలిగే సంకేతాల మధ్య తేడా పసిగట్టవచ్చు. ఎవరైనా నచ్చిన ఆహారాన్ని తినేందుకు అర్హులే. కానీ కొన్ని లక్ష్యాలు సాధించడం కోసం మార్పులు చేసుకున్నా, మనం వాటిని పూర్తి స్థాయిలో పాటించలేకపోవచ్చు. అలాంటప్పుడు మనకు చేతకాదు, నియంత్రణ లేదు.. ఇలా అనుకోకుండా, ఎదుటి వారి పట్ల చూపినట్టే మన పట్ల మనం కూడా సహానుభూతి చూపించుకోవచ్చు. అలా చేయడం వల్ల మరింత బలంగా తయారవుతాం.

## చాపకింద నీరులా..

ఆరోగ్య సంరక్షణలో చాలాదేశాలు ముందున్నప్పటికీ హెపటైటిస్ బి, సి.. ప్రజారోగ్యానికి సవాల్ విసురుతూనే ఉన్నాయి. ఏటా పది లక్షలకు పైగా ప్రాణాలను బలిగొంటున్నాయి. సాధారణ ప్రజలతో పోలిస్తే.. శ్రామిక మహిళలపై అధిక ప్రభావం చూపుతున్నాయి. ఈ 'సైలెంట్ ఇన్‌ఫెక్షన్లు'.. చాపకింద నీరులా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. హెపటైటిస్ బి, సి లక్షణాలతో అనారోగ్యానికి గురైనప్పుడు.. చాలామంది మామూలు అలసట, హార్మోన్ల హెచ్చుతగ్గులు, ఒత్తిడిగా భావిస్తుంటారు. దాంతో వ్యాధి ముదిరి ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారని ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా, ఉద్యోగాలు చేస్తున్న మహిళల్లో సమయ పరిమితులు, బాధ్యతలు సర్వసాధారణం. ఈ క్రమంలో ఆరోగ్య సంరక్షణపై అంతగా దృష్టిపెట్టడం లేదు. కొన్ని సంస్థలు వెల్‌నెస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులకే ఎక్కువగా స్క్రీనింగ్ చేస్తున్నాయి. హెపటైటిస్ నిర్ధారణ పరీక్షలు అరుదుగానే జరుగుతున్నాయి. అంతేకాకుండా.. డయాగ్నోస్టిక్ కేంద్రాలు, క్లినిక్స్ వంటివి సాధారణ వ్యాపార సమయాల్లోనే నడుస్తాయి. దాంతో, ఉద్యోగ-ఉపాధి రంగాల్లో పనిచేసేవారికి స్క్రీనింగ్ చేయించుకోవడం వీలు కావట్లేదు. ఫలితంగా, రోగనిర్ధారణ పరీక్షలు తగ్గి.. వారి ప్రాణాల మీదికి వస్తున్నది. ఈ సమస్యలకు ఆన్-సైట్ స్క్రీనింగ్ సౌకర్యాలు లేకపోవడం కూడా సమస్యను మరింత జఠిలంగా మారుస్తున్నది.

# గట్ హెల్త్‌కు బెస్ట్ ఫుడ్స్ - ఎన్నో సమస్యలకు పరిష్కారం..!!



ఆరోగ్యంగా ఉండాలంటే శరీరానికి పోషకాలు అవసరం. మనం తీసుకునే ఆహారం జీర్ణమై శరీరానికి శక్తిని ఇవ్వటంలో జీర్ణ వ్యవస్థ ప్రధాన భూమిక పోషిస్తోంది. కడుపు ఆరోగ్యం బాగుంటేనే శరీరం పూర్తి ఫిట్ గా.. అన్ని రకాల శక్తి అందుతుంది. ఏ మాత్రం జీర్ణవ్యవస్థ సక్రమంగా లేకపోయినా.. శరీరం లో ఎన్నో సమస్యలు మొదలవుతాయి. జీర్ణవ్యవస్థ బాగుండాలంటే గట్ ఆహారం చాలా అవసరం. దీని ద్వారా పూర్తిగా జీర్ణవ్యవస్థ సక్రమంగా పని చేస్తుంది. జీర్ణ క్రియను మెరుగు పర్చేందుకు కొన్ని ఫుడ్స్ ను తప్పనిసరిగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. జీర్ణవ్యవస్థను గట్ అని కూడా పిలుస్తారు. ఇది కడుపు, ప్రేగులు మరియు పెద్దప్రేగులను కలిగి ఉంటుంది. జీర్ణవ్యవస్థ సరిగ్గా పని చేయకపోవటానికి అనేక కారణాలు ఉంటాయి. అందులో అధిక యాంటీ బయోటిక్స్ వినియోగం.. ఒత్తిడి.. నిద్ర లేకపోవటం.. శారీరక వ్యాయామ లేమి.. ప్రాసెస్ చేసిన ఆహారం తీసుకోవటం వంటివి కారణాలుగా చెబుతున్నారు. ఆరోగ్యకరమైన గట్ నిర్వహణ కోసం పండ్లు, కూరగాయలు, చిక్కుళ్ళు, బీన్స్, గింజలు, తృణధాన్యాలు వంటివి అవసరం. ఎక్కువగా ఫైబర్ ఆహారం జీర్ణవ్యవస్థకు మేలు చేస్తుంది. పప్పులు, గింజలు, ధాన్యాలు లేదా గింజలు వంటి ఎంపిక చేసిన కూరగాయల వేరియంట్‌లలో లభించే ప్రీబయోటిక్ ఫైబర్‌ల నుండి గట్ ఆరోగ్యం చాలా వరకు ప్రయోజనం పొందవచ్చు. పండ్లు మరియు కూరగాయల ద్వారా శరీరానికి కావాల్సిన విటమిన్లు, ఖనిజాలు మరియు ఆరోగ్యాన్ని ఇచ్చే పదార్థాలు లభిస్తాయి. %ూశ్రీంశీ =ఘు౦% తిరుమల కొండకు ఉచిత ప్రయాణం, పరిమితం - ఇక ఫ్రీ బస్సులో ఇవి తప్పనిసరి..!! జీర్ణవ్యవస్థలో ప్రేగులకు నీరు తప్పనిసరి. ఇది ఆహారాన్ని జీర్ణం చేయడంతో పాటు పోషకాలను గ్రహించడంలో సహాయపడుతుంది మరియు మలాన్ని మృదువుగా చేస్తుంది. మూలికలు, సుగంధ ద్రవ్యాలు, రంగు రంగుల పండ్లు మరియు కూరగాయలు, గింజలు మరియు గింజలు, గ్రీన్ - బ్లాక్ టీ, కాఫీ, కోకో మరియు డార్క్ చాక్లెట్ వంటి పాలీఫెనాల్స్ అధికంగా ఉండే ఆహారాలు గట్ మైక్రోబయోమ్ కు మేలు చేస్తాయి. పెరుగు, కిమ్చి, సౌర్‌క్రాట్, కేఫీర్, కొంబుచా మరియు టేంపే వంటి పులియబెట్టిన ఆహారాలు జీర్ణ ఆరోగ్యంకు ప్రయోజనకరం. ధ్యానం, నడక, తగినంత నిద్ర, ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరం. వీటి ద్వారా జీర్ణ వ్యవస్థను బలోపేతం చేసుకుంటే.. శరీరం బలంగా.. ఆరోగ్యంగా ఉంటుంది. ఇతరత్రా సమస్యల పరిష్కారానికి మేలు చేస్తుంది.

# చిన్న పిల్లలకూ నిద్ర ఉండట్లేదు..

## మంచిగా పడుకోవాలంటే పేరెంట్స్ ఈ టిప్స్ పాటించాలి!

ఒత్తిడి.. పెద్దల్నే కాదు, పిల్లల్నీ చిత్తు చేస్తున్నది. విద్యాపరమైన టార్గెట్లలో బాల్యం బందీ అవుతున్నది. ఇక డిజిటల్ గ్యాడ్జెట్ల వాడకం.. పిల్లల నిద్రా నాణ్యతను దెబ్బతీస్తున్నది. వాటిల్లోంచి వచ్చే బ్లూలైట్ వల్ల.. నిద్రను నియంత్రించే మెలటోనిన్ సహజ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతున్నది. మొత్తంగా.. నేటితరం చిన్నారులకు కంటినిండా నిద్ర కరువైపోతున్నది. జీవనశైలిలో మార్పుల వల్ల ఈ సమస్య నుంచి బయట పడే అవకాశం ఉన్నది. కొంతమంది పిల్లలు.. ఇలా పడుకోగానే అలా నిద్రలోకి జారుకుంటారు. కొందరికి అస్సలు నిద్రపట్టదు. అలాంటి వారిని నిద్రపుచ్చడానికి తల్లిదండ్రులు నానా తంటాలు పడుతుంటారు. జీవనశైలిలో వచ్చిన మార్పులే ఇందుకు కారణంగా కనిపిస్తున్నది. అయితే, చిన్నారుల ఎదుగుదలలో ఆహారం తర్వాత నిద్రే కీలకమైంది. మెదడు వికాసానికీ నిద్ర దోహదం చేస్తుంది. కాబట్టి, పిల్లలకు కంటినిండా నిద్ర ఎంతో అవసరం. ఇందుకోసం పిల్లలకు ప్రత్యేక దినచర్యను అలవాటు చేయాలని చెబుతున్నారు నిపుణులు. కథల పుస్తకాలు చదవడం, చిన్నచిన్న వ్యాయామాలు, మృదువైన సంగీతం వినడం వంటివి పిల్లల మనసును ప్రశాంతపరుస్తాయి. ఇక స్క్రీన్ టైమ్‌ను తగ్గించడం, పడుకునే ముందు ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను పక్కన పెట్టేయడం.. నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తాయి. వారాంతాల్లోనూ ఒకే సమయానికి నిద్రలేచే అలవాటు.. నిద్ర చక్రాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇక పిల్లల్లో నిద్రను ప్రోత్సహించడానికి.. బెడ్‌రూమ్ చీకటిగా, నిశ్శబ్దంగా, చల్లగా ఉండేలా చూసుకోవాలి. మంచం సౌకర్యవంతంగా ఉండాలి. మనసుకు ప్రశాంతత చేకూర్చే పుస్తకాలు కూడా మంచి నిద్రకు ఆహ్వానం పలుకుతాయి. రాత్రి పడుకునే ముందు శరీరాన్ని సున్నితంగా స్ట్రెచ్ చేయడం, యోగా లాంటివీ.. నిద్రకు సహకరిస్తాయి. అయితే, ఇలాంటి దినచర్యలను పాటించడం కేవలం స్వల్పకాలిక పరిష్కారం కోసమే కాదు. ఇది పిల్లల్లో భావోద్వేగ పరంగా, మానసికంగా సానుకూల




మార్పు తీసుకొస్తుంది. స్థిరమైన, ప్రశాంతమైన దినచర్య.. పిల్లలకు స్వీయ నియంత్రణపై నైపుణ్యాన్ని నేర్పుతుంది. దీర్ఘకాలంలో పిల్లలు ఒత్తిడిని నిర్వహించడానికి సన్నద్ధమవుతారు. మెరుగైన భావోద్వేగాలను కలిగి ఉంటారు. మంచినిద్ర వేసే ఈ పునాది.. పిల్లల తరువాతి జీవితంలో మానసిక ఆరోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుందని పలు సర్వేలూ చెబుతున్నాయి.

# మార్కెట్

## మొబైల్స్‌పై జీఎస్టీ 5 శాతమే వేయాలి..

### కేంద్ర ప్రభుత్వానికి ఐసీఈఏ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 19: మొబైల్ ఫోన్లు, వాటి విడిభాగాలపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ను 5 శాతానికి తగ్గించాలని భారతీయ సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం 18 శాతం పడుతుండగా.. ఇది చాలా భారంగా ఉందని పేర్కొన్నది. జీఎస్టీ స్లాబుల సంఖ్యను 4 నుంచి 2కు తగ్గించేందుకు మోదీ సర్కారు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ఐసీఈఏ పై విధంగా కోరుతున్నది. కాగా, ప్రస్తుతం రోజువారీ వినియోగ ఉత్పత్తులపై 5 శాతం, స్టాండర్డ్ గూడ్స్‌పై 12 శాతం, ఎలక్ట్రానిక్స్-సర్వీసెస్‌పై 18 శాతం, లగ్జరీ-హానికర ఉత్పత్తులపై 28 శాతం జీఎస్టీ పడుతున్నది. అయితే వీటిలో 12, 28 శాతం రేట్లను తొలగించి.. 5, 18 శాతం రేట్లకే జీఎస్టీ విధానాన్ని పరిమితం చేయాలని భావిస్తున్నారు. 12 శాతం స్లాబులోని 99 శాతం గూడ్స్‌ను 5 శాతంలోకి, 28 శాతం స్లాబులోని 90 శాతం గూడ్స్‌ను 18 శాతంలోకి మార్చనున్నట్టు తెలుస్తున్నది. అయితే 5, 18 శాతం స్లాబుల్లో ఇప్పుడున్న వస్తూత్పత్తులపై పన్ను భారం ఇకపైనా అలాగే ఉంటుందని సమాచారం. దీంతో మొబైల్ ఫోన్లపై పన్నును తగ్గించాలని, దాన్ని 5 శాతం స్లాబులోకి మార్చాలని ఐసీఈఏ కోరుతున్నది. నేటి డిజిటల్ యుగంలో విద్య, ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక సేవలు, పాలనాపరమైన అంశాల్లో మొబైల్ ఫోన్ నిత్యవసర వస్తువుగా మారిందని, పన్ను భారాన్ని తగ్గించాలని ఐసీఈఏ చైర్మన్ పంకజ్ మహిం ద్రు అంటున్నారు. కాగా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో వచ్చే నెల జీఎస్టీ కౌన్సిల్ భేటీలో ఇది తేలనున్నది.




# రిస్క్‌లో 3 లక్షల ఉద్యోగాలు.. భారతీయ ఎగుమతులపై అమెరికా సుంకాల ప్రభావం

### టారిఫ్‌లు కొనసాగితే వస్త్ర, రత్నాలు-ఆభరణాల రంగాలకు కష్టాలు

### ఆటో విడిభాగాల తయారీ, ఎంఎస్ఎంఈలకూ ఇబ్బందులే

### ఇరు దేశాల మధ్య వాణిజ్య ఆందోళనలపై నిపుణులు






న్యూఢిల్లీ : అమెరికాలోకి వచ్చే భారతీయ వస్తూత్పత్తులపై ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలు.. లక్షల్లో ఉద్యోగాలను ప్రమాదంలో పడేస్తున్నాయి. టారిఫ్‌లు ఇలాగే కొనసాగితే దేశీయ ఎగుమతులపై తీవ్ర ప్రభావం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారిప్పుడు. ముఖ్యంగా అమెరికా మార్కెట్‌పైనే ప్రధానంగా ఆధారపడిన భారత వస్త్ర, రత్నాలు-ఆభరణాల రంగాల్లో 3 లక్షలదాకా ఉద్యోగాలు రిస్క్‌లో పడవచ్చని అంచనా వేస్తుండటం గమనార్హం. దేశంలో పెద్ద ఎత్తున ఉండే డిమాండ్, అమెరికాయేతర దేశాలకు భారీగా జరుగుతున్న ఎగుమతుల వల్ల సుంకాల ప్రభావం భారత్‌పై పెద్దగా ఉండబోదని కొందరు చెప్తున్నా.. మెజారిటీ విశ్లేషకులు మాత్రం కీలక రంగాలు కుదేలేనన్న అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. వాహన విడిభాగాల తయారీ సంస్థలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లు ఒడిదొడుకులకు గురి కావచ్చంటున్నారు. ఔషధ రంగం వంటి ఒకట్రెండు ఇండస్ట్రీలపై టారిఫ్‌ల ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చంటూనే.. చివరకు ఐటీ సేవలు, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (జీసీసీ) కూడా ప్రభావితం కావచ్చని చెప్తుండటం ఆందోళనల్ని రేకెత్తిస్తున్నది. కొత్త కొలువుల్లేవ్.. పాత పనులుండవ్

భారతీయ వస్త్ర, రత్నాలు-ఆభరణాల ఎగుమతుల్లో మెజారిటీ వాటా అమెరికాదే. అందుకే ఆ దేశం టారిఫ్‌లు ఇప్పుడు ఈ రంగాల్లో ప్రకంపనల్ని పుట్టిస్తున్నాయి. పెరిగే సుంకాల భారం.. అమెరికాలో భారతీయ వస్త్ర, రత్నాలు-ఆభరణాల వస్తూత్పత్తుల ధరల్ని పెంచగలవు. ఇదే జరిగితే మార్కెట్‌లో అమ్మకాలు పడిపోతాయి. ప్రత్యామ్నాయంగా అమెరికన్లు ఇతర దేశాల నుంచి వస్తున్న వస్త్ర, రత్నాలు-ఆభరణాల వైపు చూసే వీలున్నది. దీంతో క్షీణించే ఎగుమతులు.. ఉత్పత్తి తగ్గుదలకు దారితీస్తే అంతిమంగా వ్యయ నియంత్రణ, ఉద్యోగుల తొలగింపులు, నష్టాల్లో ఉన్న సంస్థల మూసివేతలే ఉంటాయని ఆయా రంగాల నిపుణులు చెప్తున్నారు. ఈ క్రమంలోనే సుంకాలు ఇలాగే కొనసాగితే దేశీయ వస్త్ర, రత్నాలు-ఆభరణాల రంగాల్లో 2 నుంచి 3 లక్షల ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డట్టేనని అంచనా వేస్తున్నారు. ఇక ఉన్న ఉద్యోగాలనే తీసేసే కంపెనీలు.. కొత్తగా నియామకాలకు ఎందుకు వెళ్తాయని కూడా ప్రశ్నిస్తున్నారు. దీంతో ఉద్యోగావకాశాలూ సన్నగిల్లుతాయని పలువురు పేర్కొంటున్నారు. తాత్కాలిక, కాంట్రాక్ట్ ఉద్యోగుల్లో లాజిస్టిక్ వర్కర్లు, షాప్-ఫ్లోర్ వర్కర్లు, సేల్స్ సిబ్బందికి ఇబ్బందులేనన్న అంచనాలున్నాయి. టెక్స్‌టైల్స్, ఆటో కంపోనెంట్స్, వ్యవసాయ, రత్నాలు-ఆభరణాల రంగాలు అమెరికా సుంకాలతో తీవ్రంగా ప్రభావితమయ్యే వీలున్నది. టారిఫ్‌లు 6 నెలలు ఇలాగే ఉంటే అత్యధికంగా జీవనోపాధినిస్తున్న వస్త్ర పరిశ్రమల్లో లక్ష ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉన్నది. సూరత్, ముంబై సీప్జ్ వంటి రత్నాల హబ్‌ల్లోనూ పెద్ద ఎత్తున ఉద్యోగులు రిస్క్‌ను ఎదుర్కొంటారు.



# అందం, అభినయంతో మెస్మరైజ్ చేసింది

రీసెంట్ డేస్ లో కొంతమంది హీరోయిన్స్ ఓవర్ నైట్ లో స్టార్ డమ్ సొంతం చేసుకుంటున్నారు. ఒకే ఒక్క సినిమాతో పాపులర్ అవుతున్నారు. ఇప్పటికే మన దగ్గర యంగ్ బ్యూటీస్ చాలా మంది. ఒకొక్క సినిమాకు ఒకొక్క హీరోయిన్ పరిచయం అవుతుంది. అయితే ఓ ముద్దుగుమ్మ మాత్రం ఇండస్ట్రీలో నాయా రికార్డ్ క్రియేట్ చేసింది. కేవలం 22ఏళ్ల ఆ ముద్దుగుమ్మ ఇండస్ట్రీని షేక్ చేసింది. ఆమె అందానికి, నటనకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఆమె తొలి సినిమానే వందలకోట్ల కలెక్షన్స్ రాబట్టింది. స్టార్ హీరోలు కూడా ఆమె నటనకు, అందానికి ఫ్లాట్ అయ్యారు. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? ఇటీవలే బాక్సాఫీస్ వద్ద ఓ సినిమా సంచలనం సృష్టిస్తుంది. ఆ సినిమాతో 22 ఏళ్ల హీరోయిన్ రికార్డ్స్ తిరగరాస్తుంది. ప్రస్తుతం బాలీవుడ్ ఇండస్ట్రీలో మారుమోగుతున్న పేరు అనీత్ పద్దా. వయసు 22 సంవత్సరాలు. పంజాబ్ లోని అమృత్ సర్ లో జన్మించిన ఈ వయ్యారి.. మోహిత్ సూరి దర్శకత్వం వహించిన సయ్యారా సినిమాతో కథానాయికగా సినీరంగంలోకి అడుగుపెట్టింది. ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించింది. జూలై 18న విడుదలైన ఈ సినిమా రూ. 570 కోట్లకు పైగా వసూలు చేసింది. ఈ సినిమాతో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది అనీత్ పద్దా. అందం, అభినయంతో మెస్మరైజ్ చేసింది. ఈ సినిమా చూసిన ప్రతి ఒక్కరు ఈ అమ్మడు గురించి తెలుసుకోవడానికి ట్రై చేశారు. అనీత్ పద్దా.. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేషన్ చేస్తుందట. నటనపై ఆసక్తితో మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టింది అనీత్ పద్దా. ఇప్పటికే పలు యాడ్స్ చేసింది. ఇక సయ్యారా సినిమాతో కథానాయికగా వెండితెరకు పరిచయమైంది. ఫస్ట్ మూవీతోనే ఊహించని విజయాన్ని ఖాతాలో వేసుకున్న ఈ సుందరి.. ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. సయ్యారా సినిమాపై చాలా మంది సెలబ్రెటీలు, స్టార్ హీరోలు కూడా ప్రశంసలు కురిపించారు. హీరోహీరోయిన్స్ పై పొగడ్తలు కురిపించారు.

# ఇంతవరకూ ఒక్క హిట్టు పడలేదు

ఎవరు ఏ రంగాన్ని ఎంచుకున్నప్పటికీ, అందులో రాణించాలంటే ప్రతిభ ఉండాలి. టాలెంట్ ఒక్కటి ఉంటే సరిపోతుందా అంటే, కొంచెం అదృష్టం కూడా ఉండాలనుకోండి అనే సమాధానం వస్తుంది. అదృష్టం అనే విషయంలో ఎవరి అభిప్రాయాలు వాళ్లకి ఉంటాయి. కాకపోతే అదృష్టం అనే దాని గురించి అప్పుడప్పుడు నమ్మవలసి వస్తుంటుంది. అందుకు కారణాలు .. కళ్లముందు కనిపించేవే అని చెప్పాల్సి ఉంటుంది. ఆశించినస్థాయిలో గుర్తింపు రానప్పుడు .. విజయాలు అందనప్పుడు .. అదృష్టం లేదని చెప్పుకుంటూ ఉంటారు. అలాంటి అదృష్టాన్ని వెతికి పట్టుకునే పనిలో ఉంటారు. ప్రస్తుతం భాగ్యశ్రీ బోర్సే అదే పనిలో ఉందని అంటున్నారు. ఇప్పుడున్న కథానాయికలలో గ్లామరస్ బ్యూటీ ఎవరంటే కుర్రకారు ఠకీమని చెప్పే మాట భాగ్యశ్రీ బోర్సే. తుమ్మెదల్లాంటి కళ్లతో మనసులు దోచే ఈ సుందరికి ఇంతవరకూ హిట్టు పడలేదు. ఆమె అభిమానులు బెంగపెట్టుకోవడంలోని అసలు కారణం ఇదే. ఈ నేపథ్యంలో ఆమె అఖిల్ సరసన నాయికగా 'లెనిన్' సినిమా చేస్తోంది. మురళీ కిశోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను, అన్నపూర్ణ – సితార సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'మే'లో ఈ సినిమాను విడుదల చేసే ఆలోచనలో ఉన్నారు. తమన్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. భాగ్యశ్రీ గ్లామర్ ఈ సినిమాకి ప్రత్యేకమైన ఆకర్షణగా నిలుస్తుందని అంటున్నారు. ఈ సినిమాతోనైనా ఆమెకి అదృష్టం కలిసొస్తుందేమో చూడాలి మరి.




# పర్సనల్ లైఫ్‌లోనూ కియారా సక్సెస్

సినిమా ఇండస్ట్రీలో కొంతమంది హీరోయిన్లు సక్సెస్ ట్రాక్ కంటిన్యూ చేస్తూ పర్సనల్ లైఫ్‌ను కూడా ఎంతో ఎంజాయ్ చేస్తుంటారు. అలా ప్రొఫెషనల్, పర్సనల్ కెరీర్‌లో ఏ లోటూ లేకుండా ఆడియన్స్‌ని ఎంటర్‌టైన్ చేస్తున్న హీరోయిన్ కియారా అద్వానీ). అందంతో పాటు యాక్టింగ్ టాలెంట్‌తో ప్రేక్షకులకు అట్రాక్ట్ చేసే ఈ నటి ప్రస్తుతం బాలీవుడ్ బిజీ భామల్లో ఒకరిగా మారిపోయింది. హిందీతో పాటు తెలుగులోనూ సినిమాలు చేస్తున్న కియారా.. ఒక పక్క సినిమాలు, యాడ్స్ చేస్తూనే మరోవైపు లగ్జరీ లైఫ్ ఎంజాయ్ చేస్తోంది. రామ్‌చరణ్ హీరోగా నటించిన 'వినయ విధేయ రామ', గేమ్ ఛేంజర్ సినిమాలతో పాటు మహేశ్ బాబుతో 'భరత్ అనే నేను'లో నటించి తెలుగు ఆడియన్స్‌ని కియారా అద్వానీ దగ్గరైంది. అందంతో పాటు యాక్టింగ్ టాలెంట్ ఆమె సొంతం. 1992, జులై 31న ముంబైలో కియారా జన్మించింది. ఈ బ్యూటీ అసలు పేరు అలియా అద్వానీ. తండ్రి జగదీప్ అద్వానీ బిజినెస్‌మ్యాన్ కాగా, తల్లి జెనీవీవ్ జాఫ్రీ టీచర్. కియారా ముంబైలోని కేథడ్రల్, జాన్ కానన్ స్కూల్‌లో స్కూలింగ్, తర్వాత జై హింద్ కాలేజీలో మాస్ కమ్యూనికేషన్ డిగ్రీ కంప్లీట్ చేసింది. అయితే ఆమె బంధువులు సినీ ఇండస్ట్రీలో ఉండటంతో చిన్నప్పటి నుంచే బాలీవుడ్ గ్లోరీ, గ్లామర్‌కి అట్రాక్ట్ అయ్యింది. కియారా 2014లో 'ఫగ్లీ' మూవీతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత 2016లో వచ్చిన స్పోర్ట్స్ బయోపిక్ 'ఎం.ఎస్ ధోనీ : ది అన్‌టోల్డ్ స్టోరీ'లో ఇంపార్టెంట్ క్యారెక్టర్ చేసి సక్సెస్ ట్రాక్‌లోకి వచ్చింది. లస్ట్ స్టోరీస్‌లో (2018) పోషించిన అన్ సాటిస్‌ఫైడ్ లైఫ్ పార్ట్‌నర్ క్యారెక్టర్‌తో తనలోని టాలెంట్‌ని బయటపెట్టింది. ఇక షాహిద్ కపూర్‌తో కలిసి సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించిన 'కబీర్ సింగ్'లో ప్రీతి క్యారెక్టర్ హైలెట్. గుడ్ న్యూజ్, షేర్షా, భూల్ భూలైయా 2, జగ్ జగ్ జీయో, సత్యప్రేమ్ కి కథ వంటి మరెన్నో చిత్రాలు చేసింది. డాన్ 3, టాక్సిక్ మూవీల్లోనూ నటిస్తోంది. కియారా కాంటెంపరరీ లైఫ్‌స్టైల్ తన క్యారెక్టర్‌ని రిఫ్లెక్ట్ చేస్తుంది. ఆమె బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాను లవ్ మ్యారేజ్ చేసుకుంది. షేర్షా సినిమా షూటింగ్ టైమ్‌లో వీరి మధ్య ప్రేమ చిగురించింది. ఇప్పుడు వీరిద్దరికి కుమార్తె పుట్టింది. ప్రస్తుతం కియారా ఫ్యామిలీ బాంద్రాలో నివసిస్తోంది. ఈమె తన పర్సనల్ లైఫ్ అప్‌డేట్స్‌ని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుంటుంది.



# టాక్సిక్ కోసం యష్ క్రేజీ మేకోవర్..

పాన్ ఇండియా స్టార్, అందులోనూ రాకింగ్ స్టార్ యష్ అనగానే.. ఆ పొడవాటి జుట్టు, గుబురు గడ్డం, ఊరమాస్ లుక్ టక్కున కళ్లముందు మెదులుతాయి. కేజీఎఫ్ సిరీస్ నుంచి దాదాపు ఎన్నో ఏళ్లుగా అదే లుక్ మైంటైన్ చేసిన యష్.. ఎట్టకేలకు ఆ ఐకానిక్ స్టైల్‌కి ఎండ్ కార్డ్ వేశాడు. గీతూ మోహన్‌దాస్ డైరెక్షన్‌లో వస్తున్న తన అప్‌కమింగ్ మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్-అప్స్' కోసం పూర్తిగా మేకోవర్ అయ్యాడు. జుట్టు, గడ్డం ట్రిమ్ చేయించుకుంటూ న్యూ లుక్‌లోకి మారుతున్న ఓ మేకింగ్ వీడియోను తాజాగా రిలీజ్ చేయగా.. ఇప్పుడది సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. అందులో తన భార్య రాధికా పండిట్ యష్ గడ్డాన్ని పట్టుకుని.. "ఫైనల్లీ.. ఈ గడ్డానికి, జుట్టుకి విముక్తి దొరికింది" అంటూ ఎమోషనల్ అవ్వడం ఫ్యాన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటోంది. యష్ క్లీన్ షేవ్ లుక్ బయటకు రావడంతో.. ఈ సినిమాలో అతడు డబుల్ రోల్ చేస్తున్నాడనే ప్రచారానికి ఆజ్యం పోసినట్టైంది. రీసెంట్‌గా ఫిబ్రవరి 21న విడుదలైన పోస్టర్‌లో యష్ 'టికెట్' అనే కుర్రాడి పాత్రలో కనిపించాడు. ఈ మేకోవర్ వీడియో ఆ క్యారెక్టర్ కోసమే. అంతకుముందు జనవరి 8న తన బర్త్‌డే రోజున 'రాయ' అనే మరో లుక్‌ను రిలీజ్ చేశాడు. దీంతో సినిమాలో యష్ రెండు డిఫరెంట్ రోల్స్ ప్లే చేస్తున్నట్లు దాదాపు క్లారిటీ వచ్చేసింది. ఇదంతా ఒకెత్తయితే.. టీజర్‌లో కొన్ని సెకన్ల పాటు కనిపించిన ఓ మిస్టరీ 'జోకర్' క్యారెక్టర్ మరో ఎత్తు. ఆ క్లౌన్ మేకప్‌లో ఉన్నది యష్ మూడో అవతారమా? లేక కథను మలుపుతిప్పే ఏదైనా సింబాలిక్ క్యారెక్టరా? అంటూ ఫ్యాన్స్ బాగా చర్చించుకుంటున్నారు. సినిమా రిలీజ్ అయ్యేలోపు ఈ పజిల్‌ను సాల్వ్ చేసే పనిలో పడ్డారు నెటిజన్లు. ఈ పీరియడ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాలో భారీ తారాగణమే ఉంది. రుక్మిణి వసంత్ (మెలిస్సా), నయనతార (గంగ), కియారా అద్వానీ (నాడియా), హుమా ఖురేషీ (ఎలిజబెత్), తారా సుతారియా (రెబెక్కా) లాంటి స్టార్స్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, యశ్ హోమ్ బ్యానర్ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో ఒకేసారి షూట్ చేయడం విశేషం. రాజీవ్ రవి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. రవి బస్రూర్, విశాల్ మిశ్రా, తనిష్క్ బాగ్చీ మ్యూజిక్ ఇస్తున్నారు. ఉజ్వల్ కులకర్ణి ఎడిటర్‌గా పనిచేస్తున్నాడు. ముఖ్యంగా హాలీవుడ్ స్టంట్ మాస్టర్ జేజే పెర్రీ యాక్షన్ సీక్వెన్స్ డిజైన్ చేయడం సినిమాపై క్యూరియాసిటీని పెంచుతోంది.





## ఒక్కటైన విజయ్ దేవరకొండ- రష్మిక మందన్న

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న (విరోష్) పెళ్లి వేడుకలు రాజస్థాన్ ఉదయపూర్‌లోని ×ుజ మెమెంటోస్ (ఎకాయా ఉదయపూర్) హోటల్‌లో ఘనంగా జరుగుతున్నాయి. సరిగ్గా ఉదయం 10 గంటల 10 నిమిషాలకు రష్మిక మెడలో విజయ్ దేవరకొండ మూడు ముళ్లు వేసినట్లు సమాచారం. అతికొద్ది మంది అతిథుల సమక్షంలో మేళ తాళాల నడుమ ఈ వేడుక అట్టహాసంగా జరిగిందని తెలుస్తోంది. ఉదయపూర్ ప్యాలెస్ వేదికగా అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యులు సమక్షంలో వేదమంత్రాల సాక్షిగా విజయ్ దేవరకొండ -- రష్మిక మందన్న ఏడడుగుల బంధంలోకి అడుగు పెట్టారు. దాదాపు 8 సంవత్సరాలుగా డేటింగ్ చేస్తున్న ఈ జంట ఎట్టకేలకు వైవాహిక బంధంలోకి అడుగుపెట్టి అభిమానులను ఖుషీ చేశారు. విజయ్ దేవరకొండ- రష్మిక మందన్న వివాహ బంధంతో ఒక్కటి కావడంతో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అటు విజయ్ ఫ్యాన్స్, ఇటు రష్మిక ఫ్యాన్స్ ఖుషీ ఖుషీ అవుతూ ఫుల్లుగా ఎంజాయ్ చేస్తున్నారు.

## 'విష్ణు విన్యాసం' ఈవెంట్‌లో నవ్వులే నవ్వులు



టాలీవుడ్‌లో తనదైన కామెడీ టైమింగ్, సహజ నటనతో ప్రేక్షకులను అలరించే హీరో శ్రీవిష్ణు మరోసారి నవ్వుల పండుగ పంచడానికి సిద్ధమయ్యారు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'విష్ణు విన్యాసం'. పూర్తి వినోదాత్మకంగా తెరకెక్కిన ఈ సినిమా రేపు ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. తాజాగా నిర్వహించిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో శ్రీవిష్ణు తనదైన శైలిలో చేసిన సందడి అందరి దృష్టిని ఆకర్షించింది. ఈవెంట్‌కు శ్రీవిష్ణు చేతిలో ఓ కోతి బొమ్మను పట్టుకుని రావడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. స్టేజ్‌పై కూడా ఆ బొమ్మను వెంట ఉంచుకోవడంతో, దీని వెనుక ఉన్న కథేంటని అందరూ ఆసక్తిగా ఎదురుచూశారు. దీనిపై శ్రీవిష్ణు స్పందిస్తూ సరదా వ్యాఖ్యలు చేశారు. "ఈ రోజు నా గ్రహస్థితి బాగోలేదని ఓ జ్యోతిష్యుడు చెప్పారు. అందుకే ఓ కోతి పిల్ల పక్కన ఉంటే అంతా మంచి జరుగుతుందని సలహా ఇచ్చారు. అయితే నిజమైన కోతిని తెచ్చుకుంటే కరుస్తుందేమోనన్న భయంతో ఈ బొమ్మను తీసుకొచ్చాను" అంటూ నవ్వులు పూయించారు. తన సినిమాలో కూడా జాతకాలను, గ్రహాలను బలంగా నమ్మే వ్యక్తి పాత్రలో నటిస్తున్నానని ఆయన చెప్పడంతో, ఇది సినిమా ప్రమోషన్‌లో భాగమని అందరికీ అర్థమైంది. ఈ సరదా సంఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సందర్భంగా శ్రీవిష్ణు మాట్లాడుతూ... 'విష్ణు విన్యాసం' ఒక హిలేరియస్ జాయ్‌రైడ్ అని అభివర్ణించారు. నిర్మాత సుమంత్ నాయుడు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం వల్లే సినిమా ఇంత బాగా వచ్చిందన్నారు. దర్శకుడు యదునాథ్ మారుతీ రావు చాలా కూల్‌గా సినిమాను అద్భుతంగా తీశారని ప్రశంసించారు. హీరోయిన్ నయన్ సారికకు ఈ చిత్రంతో మంచి పేరు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సినిమా ఫస్టాఫ్ యువతకు, సెకండాఫ్ కుటుంబ ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుందని, థియేటర్ నుంచి బయటకు వచ్చే ప్రతి ఒక్కరూ పూర్తి సంతృప్తితో వెళతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com